ఎమ్మెల్సీ పోలింగ్ పంపిణి సెంటర్‌ను పరిశీలించిన కమిషనర్

విశాలాంధ్ర - తిరుపతి : తిరుపతి నియోజకవర్గ పరిధిలో నిర్వహించనున్న శాసనమండలి ఎన్నికల నిర్వహణకు పక్కాగా ఏర్పాట్లు చేయడంతో బాటు నిర్వహణ సక్రమంగా నిర్వహించాలని తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్, శాసనమండలి ఎన్నికల నిర్వహణాధికారి అనుపమ అంజలి అన్నారు. తిరుపతి శ్రీపద్మావతి డిగ్రీ కళాశాల పిజి హాస్టల్ నందు మార్చి 13న నిర్వహించే శాసన మండలి పోలింగ్ కు అవసరమైన సామాగ్రీని భద్రపరిచి, పోలింగ్ ముందు రోజు సంబంధిత ఎన్నికల అధికారులకు, సిబ్బందికి పంపిణీ చేసే కేంద్రాన్ని, అక్కడ జరుగుతున్న ఏర్పాట్లను గురువారం అధికారులు, సిబ్బందితో కలిసి కమిషనర్ అనుపమ అంజలి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె అధికారులతో మాట్లాడుతూ ఎం.ఎల్.సి. ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్ విడుదల అయ్యిందని, తిరుపతి నియోజకవర్గ పరిధిలో గ్రాడ్యుయేట్ ఓటర్లకు 25, టీచర్లకు 4 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని, ఎన్నికల నిర్వహణకు తగినన్ని బ్యాలెట్ బాక్సులు ఉన్నాయని, శాసనమండలి ఎన్నికల సజావుగా జరిగేందుకు అన్ని ఏర్పాట్లు సక్రమంగా చేస్తున్నట్లు తెలిపారు. కమిషనర్ అనుపమ అంజలి వెంట ఉప కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, డెప్యూటీ తహశీల్దార్ జీవన్ తదితరులు ఉన్నారు.

చెన్నైలోని శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో నూతన ధ్వజస్తంభ ప్రతిష్ట

విశాలాంధ్ర - తిరుపతి : చెన్నైలోని జిఎన్ చెట్టి రోడ్డులో నిర్మాణంలో ఉన్న శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో నూతన ధ్వజస్తంభ ప్రతిష్ట గురువారం శాస్త్రోక్తంగా జరిగింది. టీటీడీ పాంచరాత్ర ఆగమ సలహాదారు శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జేఈవో వీరబ్రహ్మం, చెన్నై స్థానిక సలహామండలి అధ్యక్షులు ఎ జె శేఖర్ పాల్గొన్నారు. ముందుగా విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం తదితర వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. ధ్వజస్తంభానికి రక్షాబంధనం, కళావాహనం చేసి నవధాన్యాలు, నవరత్నాలు, నవలోహాలతో ప్రతిష్ట చేశారు. అదేవిధంగా, కూర్మ, కుబేర, మహాలక్ష్మి యంత్రస్థాపన చేశారు.

గురువులే మార్గదర్శకులు : చీఫ్ ఆడిట్ అధికారి శేషశైలేంద్ర

- శ్రీ పద్మావతి డిగ్రీ కళాశాలలో స్టూడెంట్ కౌన్సిల్ ప్రారంభోత్సవం

విశాలాంధ్ర - తిరుపతి : జీవితంలో ఉన్నతస్థాయికి చేరడానికి గురువులను మార్గదర్శకులుగా భావించాలని టీటీడీ చీఫ్ ఆడిట్ ఆఫీసర్ శేషశైలేంద్ర కోరారు. శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ, పిజి కళాశాలలో 2022-23 విద్యాసంవత్సరానికి గాను స్టూడెంట్ కౌన్సిల్ ప్రారంభోత్సవం గురువారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సిఏవో మాట్లాడుతూ, మనలో ఉన్న నైపుణ్యాన్ని గుర్తించి లోపాలు సరిదిద్ది సమాజానికి పరిచయం చేసేవారు గురువులన్నారు. అధ్యాపకులు చెప్పిన విషయాలను చక్కగా విని జీవితాన్ని సరిదిద్దుకోవాలని కోరారు. భగవద్గీత ప్రాముఖ్యతను తెలుసుకోవాలన్నారు. సహజ లక్షణాలైన ఆకలి, భయం, నిద్ర, కోరికలను నియంత్రించుకుని, మనిషి అభద్రతాభావాన్ని విడనాడాలని తెలిపారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన డిఈవో డా.ఎం.భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ, ఈ కళాశాల నాక్ ఎప్లస్ గ్రేడ్ సాధించి దేశంలోనే ఉత్తమ కళాశాలగా గుర్తింపు పొందిందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కళాశాల ప్రిన్సిపల్ డా.కె.మహదేవమ్మ మాట్లాడుతూ, ఎస్వీ యూనివర్సిటీ మార్కుల మెరిట్ ఆధారంగా విద్యార్థి సంఘ సభ్యులను ఎంపిక చేశామని తెలిపారు. ఈ సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. విద్యార్థినులందరూ క్రమశిక్షణతో నడుచుకుని మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని పిలుపునిచ్చారు. మొదటి సంవత్సరంలో చేరిన విద్యార్థినులందరూ కళాశాలలోని ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్, స్పోర్ట్స్‌లో తమకిష్టమైన వాటిలో పేరు నమోదు చేసుకోవాలని కోరారు. ఈ ఏడాది ఆన్‌లైన్ అడ్మిషన్ల ద్వారా 606 మంది విద్యార్థినులు ప్రవేశం పొందారని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టూడెంట్ కౌన్సిల్ ఇన్‌చార్జి డా. భువనేశ్వరిదేవి, విశ్రాంత తెలుగు విభాగాధిపతి డా. ప్రేమావతి, ఐఐసి కో ఆర్డినేటర్ డా.ఉమారాణి, వార్డెన్ డా.విద్యుల్లత ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యాదవులకు అన్ని రంగాల్లో ప్రాధాన్యత ఇస్తాం :నారా లోకేష్

విశాలాంధ్ర- రేణిగుంట: తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే యాదవులకు విద్య, ఉద్యోగ, రాజకీయ, పారిశ్రామిక ఇలా అన్ని రంగాల్లో ప్రాధాన్యత ఇస్తామని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ హామీ ఇచ్చారు. యువగళం పాదయాత్రలో భాగంగా 25వ రోజైన గురువారం రేణిగుంట శివారులోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో నారా లోకేష్ యాదవ కులస్థులతో సమావేశం నిర్వహించారు. యాదవులు పలు సమస్యలను నారా లోకేష్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నపుడు యాదవుల అభివృద్ధికి ప్రత్యేక కార్పోరేషన్ ఏర్పాటు చేసి రూ.278కోట్లు నిధులు విడుదల చేశామన్నారు. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చాక ఈ కార్పోరేషన్ ను నిర్వీర్యం చేసిందన్నారు. యాదవుల అభివృద్ధికి కనీసం ఒక్క పైసా నిధులు కూడా విడుదల చేయలేదన్నారు. కార్పోరేషన్ ఛైర్మన్, డైరెక్టర్లు కూర్చోడానికి కనీసం కుర్చీ కూడా ఇవ్వలేని స్థితిలో జగన్ ప్రభుత్వం ఉందన్నారు. టీడీపీ హయాంలో యాదవులకు ఆర్థికశాఖ మంత్రితో పాటు టీటీడీ ఛైర్మన్, తుడా ఛైర్మన్, నలుగురికి శాసనమండలి పదవి ఇచ్చినట్లు గుర్తు చేశారు. యాదవులను లోక్ సభకు మొట్టమొదట పంపిన ఘనత కూడా టీడీపీదే అన్నారు. నామినేటెడ్ పదవుల్లో యాదవులకు ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. గొర్రెల కాపరులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. చంద్రన్న బీమా పునరుద్ధరించి పేదలకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. యువత కోసం ప్రత్యేక నైపుణ్య శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. యాదవులు పరిశ్రమలు పెట్టుకోవడానికి ఏపీఐఐసీ భూముల్లో రిజర్వేషన్ కల్పిస్తామన్నారు. అదేవిధంగా ఆదరణ పథకం పునరుద్ధరించి యాదవులను ఆదుకుంటామన్నారు. యాదవులు అందరూ తెలుగుదేశం పార్టీకి అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కామేష్ యాదవ్, రామకృష్ణ యాదవ్, దంపూరు భాస్కర్ యాదవ్, తూకివాకం భాస్కర్ యాదవ్, బలరాం యాదవ్ పాల్గొన్నారు.

కలర్ షైన్ లో ప్రకృతి వైపరీత్యాలపై అవగాహన

విశాలాంధ్ర - గూడూరు : నేషనల్ డిజాస్టర్ మేనేజ్ మెంట్, ఆంధ్రప్రదేశ్ స్టేట్ డిజాస్టర్ మేనేజ్ మెంట్ సంయుక్త ఆదేశాల మేరకు నోడల్ ఆఫీసర్ గా రెవెన్యూ డివిజనల్ అధికారి, గూడూరు వారిని నియమిం చారు. ఆదేశాల మేరకు గురువారం గూడూరు ఆర్డీఓ ఎం. కిరణ్ కుమార్ మండల పరిధిలోని మంగళపూరు గ్రామంలో ఉన్న కలర్ షైన్ కంపెనీ సిబ్బందికి ప్రమాదాల వలన జరిగే ఆపదలను ఎదుర్కొనేందుకు మార్క్ పోల్ ఎక్సైజ్ ఆన్ కెమికల్ డిజాస్టర్ పై మాక్ డ్రిల్ తో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కంపెనీ పరిసరాలను పరిశీలించారు. కంపెనీ పక్కన ఉన్న ఎలిమెంటరీ స్కూల్ లో ఏర్పాటు చేసిన రీ-హాబీటేషను సెంటర్, కంపెనీ నుండి రి-హాబీటేషను సెంటరుకు తరలించేందుకు రెండు బస్సులు, మంటలను ఆర్పేందుకు రెండు ఫైర్ ఇంజనులు, గాయపడిన వారిని గూడూరు ఏరియా హాస్పిటలుకు తరలించేందుకు రెండు అంబులెన్సులు ఏర్పాటు చేశారు. వాటిని కూడా ఆయన పరిశీలించారు. ఆయన వెంట డిస్ట్రిక్ట్ చీఫ్ ఫ్యాక్టరీ అథారిటీ, ఎస్.డి. ఆర్ఎఫ్ బృందం, డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ పాల్గొన్నారు.

రీ సర్వే ప్రక్రియను త్వరిత గతిన పూర్తి చేయాలి : సిసిఎల్ఏ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ

రీ సర్వే రెండవ విడత గ్రామాలలో గ్రౌండ్ ట్రూతింగ్ మార్చి 31 లోపు పూర్తి చేయాలి:కలెక్టర్

విశాలాంధ్ర - తిరుపతి : రీ సర్వే ప్రక్రియకు సంబందించి గ్రౌండ్ ట్రూథింగ్ ప్రక్రియను నిర్దేశించిన గడువులోపు పూర్తి చేసేలా చూడాలని సి.సి.ఎల్.ఏ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ జి.సాయిప్రసాద్ అన్ని జిల్లాల కలెక్టర్ లను ఆదేశించారు. గురువారం విజయవాడ సి.సి.ఎల్.ఏ. కార్యాలయం నుండి స్పెషల్ చీఫ్ సెక్రెటరీ రీ సర్వే కార్యాచరణ, అమలు తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో వీడియో కన్ఫరెన్స్ నిర్వహించగా జిల్లా కలెక్టరేట్ నుండి కలెక్టర్ కె.వెంకటరమణా రెడ్డి, జె.సి. డి.కె.బాలాజీ, డి.ఆర్.ఓ. శ్రీనివాస రావు, జిల్లా సర్వే అధికారి జయరాజ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సి.సి.ఎల్.ఏ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన రీ సర్వే కు సంబంధించి గ్రౌండ్ ట్రూథింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని అన్నారు. రీ సర్వే కు సంబంధించి మ్యూటేషన్ కరెక్షన్, ట్రాన్సా క్షన్ తదితర అంశాలపై సమీక్షించారు. వీడియో కన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ సంబందిత అధికారులతో మాట్లాడుతూ రీ సర్వే రెండవ దశ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో 202 గ్రామాలకు గాను 133 గ్రామాలలో గ్రౌండ్ ట్రూథింగ్ ప్రక్రియ పూర్తి కాగా మిగిలిన గ్రామాల్లో మార్చ్ 31 నాటికి పూర్తి చేయాలని అన్నారు. 22 గ్రామాలకు గాను 18 గ్రామాలలో ఫైనల్ ఆర్.ఓ.ఆర్, డ్రాఫ్ట్ ల్యాండ్ రిజిస్ట్రేషన్ 28 గ్రామాలలో పనులు పూర్తి అయిన నేపథ్యంలో మిగిలిన గ్రామాల్లో త్వరిత గతిన పూర్తి చేయాలని అన్నారు. హద్దు రాళ్ళు నాటే ప్రక్రియకు సంబందించి 69 గ్రామాలకు గాను 13 గ్రామాలలో పూర్తి అయ్యిందని అధికారులు వివరించగా మిగిలినవి కూడా తొందరలో పూర్తి చేయాలని ఆదేశించారు.

తల్లిదండ్రుల ఆలోచనా విధానంలో మార్పు రావాలి:ఎస్పీ

విశాలాంధ్ర - తిరుపతి : "నేటి సమాజంలో మధ్యతరగతి కుటుంబాల వారు పరువు ప్రతిష్టలను ప్రాణంగా భావిస్తారు అదే నేడు సామాజికంగా నిర్మాణాత్మక దృగ్విషయం. సమాజంలో మార్పును తీసుకుని వచ్చి భవిష్యత్తులో భారతదేశంలో పరువు హత్యలు జరగకుండా నివారించి, "ప్రపంచ పటంలో మహిళా భద్రత అంటే భారత్, భారత్ అంటే మహిళా భద్రతా" అని గుర్తుకు వచ్చేలా చేయాలి."భారతదేశంలో పరువు హత్యలు సామాజిక మానసిక కారకాలపై లా విద్యార్థినుల కోసం రెండు రోజుల సెమినార్స్ తల్లిదండ్రులు ఆడపిల్లలను ఒక వ్యక్తిగా కాకుండా ఒక ఆస్తిగా పరిగణించడం వల్ల పరువు హత్యలు మతాంతర, కులాంతర వివాహాలను తమ పిల్లలు చేసుకోవడం వలన తల్లిదండ్రులు మానసికంగా భావోద్వేగానికి గురై మూర?పు ఆలోచనతో పరువు హత్యకు పాల్పడటం శ్రీ పద్మావతి మహిళా యూనివర్సిటీ సావేరి సెమినార్ హాల్ నందు జరిగిన "జాతీయస్థాయి పరువు హత్యలపై సామాజిక మానసిక కారకాలు" అనే అంశాలపై జరిగిన సదస్సులో ముఖ్య అతిథి గా జిల్లా ఎస్పి పి.పరమేశ్వర రెడ్డి ఐపీఎస్., పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని మహిళా విశ్వ విద్యాలయ వైస్ చాన్సెలర్ అనురాధ, రిజిస్ట్రార్ రజని వారు ఏర్పాటు చేసారు. ఇటీవల కాలంలో దేశవ్యాప్తంగా మహిళల పట్ల జరిగే పరువు హత్యలు మన దేశ ప్రగతిని, ప్రతిష్టను ప్రపంచవ్యాప్తంగా దెబ్బతీస్తున్నాయి. స్వాతంత్ర్యానంతరం మన భారతదేశంలో బడుగు బలహీన వర్గాల మహిళల కోసం అనేక చట్టాలు వచ్చాయి అందువలన మనదేశంలో సామాజికంగా ప్రజల ఆలోచనా దృక్పథంలో కూడా చాలా గొప్ప మార్పు వచ్చింది తద్వారా మతాల మధ్య, కులాల మధ్య అంతరాలు చాలా వరకు తగ్గి, సామరస్య వాతావరణం ఏర్పడిందన్నారు. నేటి బాలికలే రేపటి మహిళలు కావున మీరు కుటుంబ గౌరవాన్ని, కుటుంబ పరువు ప్రతిష్టలను నిలబెట్టుకుంటూ, కాపాడుతూ, తల్లిదండ్రులకు ధైర్యాన్ని నమ్మకాన్నిస్తూ, వారు మీ మనో భావాలను అంగీకరించేంతవరకు ఓపికగా ప్రయత్నిస్తూ, అందరిని ఒప్పించి అందరి సమక్షంలో అనుకున్నది విజయం సాధించాలని తద్వారా తల్లిదండ్రులకు సముచిత స్థానము ఇచ్చి మంచి సమాజాన్ని నిర్మిస్తారని ఆశిస్తున్నాను అని అన్నారు. నేటి సమాజంలో తల్లిదండ్రులతో పాటు కుటుంబ సభ్యులు కూడా ఆడ పిల్లల్ని మరియు మహిళలను ఒక వ్యక్తిగా కాకుండా తమ సొంత ఆస్తిగా పరిగణిస్తున్నారు, ఎందుకంటే వారే తమ కుటుంబ పరువు ప్రతిష్టగా భావించి చాలా జాగ్రతగా కాపాడుకుంటూ వస్తారు. అందువల్లనే ఆడ పిల్లలు తమ తల్లిదండ్రులకు ఇష్టం లేని వ్యవహారాలు నడపడం ఇష్టం లేని పెళ్లి చేసుకోవడం అది తమ కుటుంబ సభ్యులకు నచ్చకపోవడం వంటి కారణాల వలన మూర?పున్ ఆలోచనతో పరువు హత్యలు జరుగుతున్నాయి అన్నారు. ఇటువంటి సమయంలో ఆడపిల్లలు తన ఇష్టాను సారం పోకుండా ప్రేమతో పెంచి పెద్ద చేసిన తల్లిదండ్రుల గురించి కూడా ఆలోచిన్చాలన్నారు. ప్రేమ పెళ్లి విషయంలో అవసరమైనప్పుడు పోలీసుశాఖ సహాయసహకారాలు ఎల్లవేళ్లలా సిద్ధంగా ఉందని అన్నారు. పిల్లలు మతాంతర, కులాంతర వివాహాలను చేసుకోవడం వలన కూడా తల్లిదండ్రులు అవమానంగా భావించి సామాజికంగా, మానసికంగా కృంగిపోయి, వారిలో అభద్రతాభావం ఏర్పడి పరువు హత్యలు జరగడానికి ఒక కారణం అని కూడా చెప్పవచ్చు. దీనికి ముఖ్య కారణం తల్లిదండ్రులు ఎంతో గారాబంగా పెంచుకున్న తమ పిల్లలను చంపే అంత స్థాయికి దిగజారుతున్నారంటే వారు ఎంతో భావోద్వేగానికి గురై, మానసికంగా వారు తమ ఆధీనంలో లేకుండా విచక్షణ కోల్పోవడం వలన ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయి అన్నారు. పరువు పరువు అనే అనాలోచిత ఆలోచన వలన తమ పిల్లలను విషయంపై మొండిగా తామే నేరస్తులు అయ్యేందుకు కూడా నేటి సమాజంలో పరువు అనే విషము నాటుకుపోయిందని అన్నారు. ఇలాంటి ఘటనలు గ్రామాలలో తరచూ జరుగుతున్నాయి. గ్రామ స్థాయిలో కుల సంఘాలు, పంచాయతీలు నేటికీ అక్కడక్కడ కనబడుతూ ఉంది. వారి యొక్క మూర?పు మొండి చర్యలను అరికట్టడానికి గ్రామాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించుటకు మా పోలీస్ శాఖ తరపున మా మహిళా సంరక్షణ కార్యదర్శులను కూడా నియమించి మీకు సహాయ సహకారాలు అందించడానికి కృషి చేస్తామన్నారు. ఒకప్పుడు పరువు హత్యలు అంటే ఉత్తర భారత దేశంలో మాత్రమే జరిగేవి కానీ ఇటీవల కాలంలో దక్షిణ రాష్ట్రాలలో కూడా జరుగుతున్నాయి. ఇప్పటివరకు రాజస్థాన్ రాష్ట్రంలో మాత్రమే పరువు హత్యలపై ఒక ప్రత్యేక చట్టాన్ని అక్కడ ప్రభుత్వం తీసుకువచ్చింది. రాజస్థాన్ పొరుగు రాష్ట్రాలైనటువంటి పంజాబ్, హర్యాణ, ఉత్తరప్రదేశ్ రాష్ట్రలలో కూడా ఈ చట్టాన్ని అమలు చేయుటకు సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నారని అన్నారు. అన్ని నేరాలకు చట్టాలు తెచ్చుకుంటున్న నేటి సమాజంలో ఈ పరువు హత్యలపై కూడా ఒక ప్రత్యేక చట్టాన్ని ప్రభుత్వాలు తీసుకువచ్చి కులాంతర, మతాంతర వివాహాలు చేసుకున్న వారికి అండగా నిలిచి, వారికి అవగాహన కల్పించి, కొద్ది రోజులపాటు వారిని షెల్టర్ హోమ్స్ ఏర్పాటు చేయడంతో పాటు, వారికి తాత్కాలిక ఉపాధి అవకాశాలను కల్పించి, ఇరు కుటుంబ సభ్యుల మధ్య సఖ్యత పెంచి వారిలో పరివర్తన తెచ్చినప్పుడే ఈ పరువు హత్యలను అరికట్టవచ్చునన్నారు. సాదారణంగా పరువు హత్యలు జరిగినా కొద్ది రోజుల వరకు వివిధ సంఘాల వారు మనవ హక్కులపై పోరాడతారు. తదనంతరం వారు కూడా ఇతర సమస్యల నిమగ్నం అవడం వలన ఇలాంటి ఘటనలకు పూర్తి న్యాయం జరగడంలో జాప్యం జరుగుతుంది. అలా జరగకుండా ఉండేందుకు నేడు శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్, రిజిస్టర్ వారు మరియు లా డిపార్ట్మెంట్, ఉమెన్ సేఫ్టీ స్టడీస్ డిపార్ట్మెంట్ సంయుక్తంగా లా విద్యార్థిలకు ఇలాంటి సదస్సుల ద్వారా వారిలో అవగాహన పెంచడంతో పాటు, వారిని చైతన్యవంతుల్ని చేసి రేపటి సమాజంలో ఇలాంటి పరువు హత్యలు జరగకుండా అరికట్టేందుకు చేసే ఈ కృషి అభినందనీయమన్నారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వ విద్యాలయ మాజీ వైస్ చాన్సెలర్ జమున మాట్లాడుతూ పోలీసు వ్యవస్థ వలన మనము సమాజంలో రాత్రి పగలు చాలా భద్రతగా భావిస్తున్నాము. అంతే స్వేచ్ఛగా మీరు మహిళల సమస్యల గురించి అనగా గృహనిర్బంధం, ప్రేమ వివాహాలు, పరువు హత్య జరిగే అవకాశం ఉన్నపుడు ఎప్పుడైనా ఎక్కడైనా పోలీస్ శాఖను సంప్రదించి తగిన న్యాయాన్ని పొంది పరువు హత్యలు జరగకుండా నివారించవచ్చునన్నారు. ఐక్యరాజ్యసమితి నివేదిక ప్రకారం ప్రతి సంవత్సరం సుమారుగా 5000 పరువు హత్యలు ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్నాయన్నారు. 20 సంవత్సరాలు పాటు తమ పిల్లలను ఎంతో గారాబంగా, సంతోషంగా సాకుతూ కాపాడుకుంటూ వచ్చి, నేడు ఒక సంవత్సరం వ్యవధిలో ఎవరినో ప్రేమించానని, అతడిని పెళ్లి చేసుకుంటానని తల్లిదండ్రులతో వాదించి, గొడవపడటం వలన ఆ సమయంలో తల్లిదండ్రులు ఎంతో భావోద్వేగం చెంది మానసికంగా, సామాజికంగా అభద్రతా భావానికి గురై అనాలోచితంగా మూరంపు చర్య వలన పరువు హత్యలకు కారణం అవుతున్నాయి అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా విశ్వ విద్యాలయ వైస్ చాన్సెలర్ అనురాధ, రిజిస్ట్రార్ రజని, ప్రొఫెసర్లు డా.ఉమాదేవి, డా.నీరజ, సీతా కుమారి మరియు లా విద్యార్థులు పాల్గొన్నారు.

పనిచేసే అభ్యర్థులకే తొలి ప్రాధాన్యత ఓటు

రాష్ట్ర రాజకీయ విద్యా సబ్ కమిటీ నాయకులు మిరియం వెంకటేశ్వర్లు

విశాలాంధ్ర - గూడూరు : సమస్యల పరిష్కారానికి కృషి చేసే ఎమ్మెల్సీ అభ్యర్థులను ఉపాధ్యాయులు, పట్టభద్రులు గెలిపించి శాసనమండలికి పంపించాలని రాష్ట్ర రాజకీయ విద్యా సబ్ కమిటీ నాయకులు మిరియం వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం గూడూరు పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో కార్మిక, ఉద్యోగ, సంఘాల నాయకులతో జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 13వ తేదిన నిర్వహించనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి బాబురెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి మీగడ వెంకటేశ్వర్ రెడ్డిని ఉపాధ్యాయులు, పట్టభద్రులు మొదటి ప్రాధాన్యతన ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. పరిపాలనలో వైసిపి ప్రభుత్వం విఫలమైందన్నారు. గతంలో సమస్యల పరిష్కారానికి విఠపు బాల సుబ్రహ్మణ్యం, శ్రీనివాసులు రెడ్డి ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా రాజకీయ పార్టీలు ప్రవేశించాయన్నారు. ఈ సమావేశంలో వెంకట్రామిరెడ్డి, జోగి శివకుమార్, వెంకటరమణ, బివి. రమణయ్య, గోపి, పుట్టా శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల మార్కెట్ లో మౌలిక వసతుల కల్పన

విశాలాంధ్ర - గూడూరు : నూతనంగా నిర్మిస్తున్న కూరగాయల మార్కెట్ లో ప్రజలకు కావలసిన అన్ని రకాల మౌలిక వసతులు ఏర్పాటు చేస్తున్నామని అలాగే పాత మార్కెట్లో వ్యాపారం చేస్తున్న వారందరికి నూతన మార్కెట్ లో అవకాశం కల్పిస్తామని ఎమ్మెల్యే వరప్రసాద్ వెల్లడించారు. గూడూరు పట్టణంలోని సొసైటీ లో ఉన్న ఎమ్మెల్యే వరప్రసాద్ నివాసంలో కూరగాయల మార్కెట్ వ్యాపారస్థులతో ఆయన సమావేశం నిర్వహించారు. వ్యాపారస్తులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన కూరగాయల మార్కెట్ మరో రెండు నెలల్లో పూర్తి కావస్తుందన్నారు. మార్కెట్ కు వచ్చే ప్రజలకు పార్కింగ్, టాయిలెట్ బ్లాక్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గతంలో వ్యాపారాలు చేస్తున్న వారందరికి అవకాశం కల్పిస్తామన్నారు. అలాగే గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చి రోడ్డుసైడు కూరగాయలు అమ్ముకుంటున్న వారికి కూడా తగిన విధంగా అవకాశం కల్పిస్తామన్నారు. ఈ సమావేశంలో నాయకులు తాళ్లూరు శ్రీనివాసులు బత్తిని విజయ్ కుమార్, గోపాల్ యాదవ్, అజీజ్, నరసయ్య పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూమ్ పరిశీలన

విశాలాంధ్ర - గూడూరు : మార్చి 13వ తేదీన నిర్వహించనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి బ్యాలెట్ బాక్సులు భద్రపరిచేందుకు గురువారం గూడూరు రెవెన్యూ డివిజనల్ అధికారి ఎం. కిరణ్ కుమార్ స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలోని స్ట్రాంగ్ రూమ్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 13న ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు పట్టభద్రుల నియోజకవర్గ, ఉపాధ్యాయ నియోజక వర్గ ఎన్నికలు జరగనున్నాయన్నారు. అందులో భాగంగానే బ్యాలెట్ బాక్సులను భద్రపరిచేందుకు స్ట్రాంగ్ రూమ్ ను పరిశీలించామన్నారు. ఆయన వెంట గూడూరు తహశీల్దార్ బాల లీలారాణి, ఇన్స్ పెక్టర్ ఆఫ్ సర్వే, డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే, సర్వేయర్ తదితరులు ఉన్నారు.

ఎస్వీబీసీ ఛానల్ పై ఈవో సమీక్ష

విశాలాంధ్ర - తిరుపతి : ఎస్వీబీసీ హిందీ ఛానల్ ద్వారా శ్రీవేంకటేశ్వర స్వామి వైభవాన్ని దేశమంతటా ప్రచారం చేసేందుకు చేపట్టాల్సిన చర్యలపై టిటిడి ఈవో ఎవి.ధర్మారెడ్డి గురువారం సమీక్ష నిర్వహించారు. తిరుపతిలోని టిటిడి పరిపాలనా భవనంలో గల కార్యాలయంలో జరిగిన ఈ సమీక్షలో ఎస్వీబీసీ సిఈఓ షణ్ముఖ్‌కుమార్, జియో వైస్ ప్రెసిడెంట్(ముంబై), ఐటి జిఎం సందీప్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ హిందూ సనాతన ధర్మ ప్రచారంలో భాగంగా తిరుమల, ఇతర అనుబంధ ఆలయాల్లో నిర్వహిస్తున్న వివిధ సేవలు, కైంకర్యాలు, పండుగలు, ధార్మిక కార్యక్రమాలను దేశవ్యాప్తంగా ఉన్న ప్రతి భక్తుని చెంతకు తీసుకెళ్లాలన్న ప్రధాన ఉద్దేశంతో శ్రీ వేంకటేశ్వర భక్తి ఛానల్ ప్రారంభమైందన్నారు. ఎస్వీబీసీ తెలుగు, తమిళం, కన్నడ ఛానళ్లు ఇప్పటికే విశేష ప్రజాదరణ పొందాయన్నారు. ఎస్వీబీసీ హిందీ ఛానల్ కు కూడా ప్రాచుర్యం కల్పించేందుకు హిందీ మాట్లాడే ప్రాంతాలలో జియో వంటి వేదిక అవసరమన్నారు. జియో ఫైబర్ నెట్ ప్లాట్‌ఫారమ్‌లో ఎస్వీబీసీ హిందీ ఛానల్ ను ప్రసారం చేయడం, ఎస్వీబీసీ ఆన్‌లైన్ రేడియోకు మరింత ప్రాచుర్యం కల్పించడంపై జియో అధికారులతో చర్చించాలని ఎస్వీబీసీ సిఈఓను ఆదేశించారు.

కుదుట పడిన యూపీ నివాసి ఆరోగ్యం

కుటుంబ సభ్యులకు అప్పగింత

విశాలాంధ్ర - గూడూరు : ఈ నెల 20వ తేదీన గూడూరు రైల్వే పోలీసులు ఒక గుర్తు తెలియని వ్యక్తిని గూడూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో చేర్పించి వైద్య సేవలు అందిస్తూ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. బుధవారం సాయంత్రం చికిత్స పొందుతున్న వ్యక్తి తెలివిలోనికి వచ్చి అతనికి సంబంధించిన వారికి చరవాణిలో సమాచారం ఇచ్చారు. గురువారం ఆ వ్యక్తికి సంబంధించిన వారు ఆసుపత్రికి చేరుకుని వివరాలు తెలిపారు. చికిత్స పొందుతున్న వ్యక్తి సమాచారం మేరకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రం గోరఖ్ పూర్ ప్రాంతానికి చెందిన ధర్మేంద్ర స్వాన్ బేల్దారి మేస్త్రిగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో చెన్నైలో పనిచేసేందుకు ఈనెల 19వ తేదీ రాత్రి రైళ్లలో ప్రయాణిస్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు అతనికి త్రాగునీటిలో మత్తుమందు కలిపి ఇచ్చారు. దీంతో ధర్మేంద్ర మత్తులోకి వెళ్ళగానే అతని వద్ద ఉన్న సెల్ ఫోన్లు, నగదు అపహరించుకు వెళ్లారు. మత్తులో ఉన్న ధర్మేంద్ర గూడూరు రైల్వే జంక్షన్ లో ఈనెల 20వ తేదీ తెల్లవారుజామున దిగి అపస్మారక స్థితిలో పని ఉండగా గూడూరు రైల్వే పోలీసులు ఆయనను ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు.

అట్రాసిటీ కమిటీ సభ్యుడు భూముల పరిశీలన

విశాలాంధ్ర - గూడూరు : గూడూరు మండలం గొల్లపల్లిలో మెట్ట భూములను గురువారం జిల్లా ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కమిటీ సభ్యుడు ఎన్వీ. రమణ పరిశీలించారు. ఈ భూముల్లో సాగుకు అవకాశం కల్పించాలని కోరుతూ అనేక సంవత్సరాలుగా ఎస్సీలు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో సమస్యను తెలుసుకునేందుకు ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించారు. గ్రామ సమీపంలోని భూములను స్థానిక రైతులతో కలిసి సందర్శించి వివరాలను తెలుసుకున్నారు. పరిస్థితిని ఉన్నతాధికారులకు నివేదిస్తామని చెప్పారు. ఆయన వెంట సూళ్లూరు కృష్ణయ్య కూడా ఉన్నారు.

డాక్టర్ సందాని హత్య కేసును ఛేదించిన పోలీసులు

వివరాలను వెల్లడించిన గూడూరు డిఎస్పి

విశాలాంధ్ర-వెంకటగిరి: ఈనెల 12వ తేదిన డక్కిలి మండంలో జరిగిన ఆర్ఎంపి డాక్టర్ హత్య కేసు నింధితులను వెంకటగిరి సర్కిల్ పోలీసుస్టేషన్‌లో విలేకర్ల ముందు హజరు పరిచారు. ఈ కేసు ధర్యాప్తు వివరాలను గూడూరు డిఎస్‌పి సూర్యనారాయణరెడ్డి వివరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మృతుడు సందానికి ఆర్ఎంపి డాక్టర్‌గా మంచి గుర్తింపు ఉందన్నారు. రోగులు అతని వద్దకే వెళుతున్నారని సందానిని చంపేస్తే రోగులు అంతా తన వద్దకే వస్తారనే దురుద్దేశ్యంతోనే పక్క గ్రామంలో ఆర్ఎంపిగా డాక్టర్‌గా ప్రాక్టీసు పెట్టుకున్న బొలిగల ప్రకాష్ హత్యకు పథకం రచించినట్లు తెలియజేశారు. ఆర్ఎంపి డాక్టర్ సందానిది హత్య సూపారి హత్యేనని పేర్కొన్నారు. 2 లక్షలకు సుపారికి మాట్లాడుకొని మొదట 15 వేల రూపాయలు తీసుకుని హత్య చేశారన్నారు. నిందితులు మొత్తం 10 మందన్నారు. హత్యకు ప్రణాళిక వేసింది లింగసముద్రం ఆర్ఎంపి డాక్టర్ ప్రకాష్ కావడంతో అతనిని ఎ1 ముద్దాయి గుర్తించామన్నారు. హత్య చేసింది తిరుపతికి చెందిన పాత నేరస్థులు అనిల్, ప్రేమ్ ఎ3, ఎ4గా కేసు నమోదు చేసినట్లు తెలియజేశారు. పెట్లూరు గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ సుబ్రమణ్యం ఎ2 ముద్దాయిగా ధర్యాప్తు తేలినట్లు తెలిపారు. హత్య రోజు సందానినీ వెంబడించి చూపించింది ఎ1 ముద్దాయి ప్రకాషేనన్నారు. హత్యలో పాల్గొంది అనిల్, ప్రేమ్, ఎ3,ఎ4లను ఎ2 ద్వారా ఎ1 ముద్దాయి సంప్రదించినట్లు ధర్యాప్తులో తెలినట్లు పేర్కొన్నారు. హత్యకు కత్తులు,రోకలి బండ లాంటి వస్తువు ఉపయోగించి హతమార్చినట్లు పేర్కొన్నారు. నెల రోజులుగా రెక్కీ నిర్వహించి హత్యకు ప్రణాళిక చేశారన్నారు. హత్యకు ముందు నిందితులు వెంకటగిరి లాడ్జిలో మందు తాగి, బట్టలు కొన్నట్లు తెలియజేశారు. తనకు తెలిసిన మరో వ్యక్తి ద్వారా పెట్లూరు లో ఆటో నడుపుకునే నేర చరిత్ర కలిగిన సుబ్రమణ్యంను కలిసి సందానిని హత్య చేయాలని చెప్పగా అతను తిరుపతిలో తనకు తెలిసిన నేరచరిత్ర కలిగిన అనిల్ , ప్రేమ్ వారితో కలిసి సందాని హత్యకు కుట్ర పన్ని చంపేశారనరు. వెంకటగిరి లాడ్జిలో ప్రధాన నిందితులకు మందు బట్టలు కొనిచ్చిన హత్య సహకరించిన మరి కొంత మంది పై కూడా కేసు నమోదు చేసినట్టు డిఎస్పి సూర్యనారాయణ రెడ్డి మీడియాకు తెలిపారు. ఈ కేసు చేదించిన వారిలో వెంకటగిరి సర్కిల్ ఇన్స్‌పెక్టర్ రామకృష్ణా, వెంకటగిరి ఎస్ఐ జిలానీ బాషా, దక్కిలి ఎస్ఐ నాగరాజు,బాలాయ పల్లి ఎస్ఐ, పోలీసు సిబ్బందిని డిఎస్పి అభినందించారు.

విశాలాంధ్ర చిత్తూరు జిల్లా

నాడు-నేడు సిమెంట్ వాడకానికి చర్యలు తీసుకుంటాం: పిఓ

- కథనానికి కదలిక

విశాలాంధ్ర - వెదురుకుప్పం : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో నాడు నేడు పనుల కోసం నిల్వ ఉంచిన సిమెంట్ బస్తాలను వినియోగంలోకి తీసుకురావడానికి చర్యలు చేపడతామని సర్వ శిక్ష ప్రాజెక్ట్ ఆఫీసర్ వెంకటరమణారెడ్డి చెప్పారు.గురువారం పాఠశాలల అభివృద్ధి కోసం నాడు నేడు ద్వారా పనులు చేయడానికి నిల్వ ఉంచిన 5500 సిమెంట్ బస్తాలు పాడైపోతున్న నేపథ్యంలో "వెదురుకుప్పంలో నాడు నేడుకు గ్రహణం "అనే శీర్షికన ఈనెల 23న విశాలాంధ్రలో వార్త ప్రచురితమైన విషయం విధితమే. ఈ నేపథ్యంలో జిల్లా ఉన్నతాధికారులు స్పందించి మండలంలోని నాడు నేడు పనుల పర్యవేక్షణ అధికారులను నివేదిక కోరినట్టు తెలిసింది.ఈ క్రమంలో సర్వ శిక్ష ప్రాజెక్టు ఆఫీసర్ వెంకటరమణారెడ్డి,సీఎంఓ గుణశేఖర్ రెడ్డి ,మండలంలోని జక్కదోన, నల్లవెంగనపల్లి,పచ్చికాపల్లం,పాఠశాలల్లోని సిమెంట్ నిల్వలను పరిశీలించారు.ఇదే క్రమంలో డివిజనల్ ఇంజనీర్ చంద్ర సురేష్ ,అసిస్టెంట్ ఇంజనీరు మంజుల, నల్లవెంగనపల్లి జడ్పీ హైస్కూల్, వేణుగోపాలపురం ప్రాథమిక పాఠశాల, దేవలంపేట జడ్పీ హైస్కూల్ నందు సిమెంట్ నిల్వలను వేర్వేరుగా పరిశీలించారు. అనంతరం పాఠశాలలోని సిమెంట్ నిల్వలను పరిశీలించి అభివృద్ధి పనులు జరుగుతున్న మరో శాఖలకు ఈ సిమెంట్ బదలాయింపు చేసి తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు.అలాగే కొన్ని పాఠశాలల్లో అభివృద్ధి పనుల కోసం కావాల్సిన మెటీరియల్ ఉన్నందువల్ల వెంటనే పనులు ప్రారంభించాలని ఆయా ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేసినట్టు ప్రాజెక్ట్ ఆఫీసర్ తెలిపారు.పాడైపోతున్న సిమెంట్ నిల్వలపై పాలన అధికారికి నివేదిక ఇవ్వనున్నట్లు చెప్పారు.

స్థానిక సంస్థల ఎమ్మెల్సీకి రెండు నామినేషన్ దాఖలు

విశాలాంధ్ర- చిత్తూరు: ఉమ్మడి చిత్తూరు జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానానికి ఇద్దరు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు . గురువారంతో నామినేషన్ల స్వీకరణ గడువు ముగిసింది వైకాపా అభ్యర్థిగా శ్రీకాళహస్తికి చెందిన సిపాయి సుబ్రహ్మణ్యం నామినేషన్ దాఖలు చేయగా, విజయపురానికి చెందిన ధనుంజయులు తెలుగుదేశం పార్టీ మద్దతుతో స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. అయితే ఉమ్మడి చిత్తూరు జిల్లాలో స్థానిక సంస్థల్లో అధికార పార్టీకి సంపూర్ణ మెజార్టీ ఉండడంతో ఈ ఎన్నిక ఏకగ్రీవం అవుతుందని వైసీపీ శ్రేణులు భావించాయి. నామినేషన్ల చివరి రోజు తెలుగుదేశం పార్టీ మద్దతుతో స్వతంత్ర అభ్యర్థిగా ధనుంజయులు నామినేషన్ దాఖలు చేయడంతో వైసిపి శ్రేణుల్లో అలజడి నెలకొంది. అయితే వైకాపా కు ఉమ్మడి చిత్తూరు జిల్లా స్థానిక సంస్థల్లో పూర్తి మెజార్టీ ఉండడంతో ఎన్నిక జరుగుతుందా లేదా అనేది ప్రశ్నార్థంగా మారింది. గురువారం వైకాపా అభ్యర్థి సిపాయి సుబ్రహ్మణ్యం అట్టహాసంగా ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, తిరుపతి ఎంపీ గురుమూర్తి, చిత్తూరు శ్రీకాళహస్తి ఎమ్మెల్యేలు శ్రీనివాసులు మధుసూదన్ రెడ్డి, ఎమ్మెల్సీ భరత్ తదితరులతో కలిసి వచ్చి నామినేషన్ దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థి అయిన ధనుంజయులు టీడిపి ఎమ్మెల్సీ దొరబాబు, టీడిపి నేత సప్తగిరి ప్రసాద్తో కలిసి వచ్చే నామినేషన్ దాఖలు చేశారు.

రెండు ఎమ్మెల్సీ, పదవులు ఇచ్చినందుకు సీఎంకు కృతజ్ఞతలు

విశాలాంధ్ర - కార్వేటినగరం : రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వన్నెకాపు,వన్నె రెడ్డి బీసీ కులాలకు చెందిన భరత్, సిపాయి సుబ్రహ్మణ్యం లకు ఎమ్మెల్సీ పదవులు ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు సుబ్రహ్మణ్యస్వామి ఆలయ కమిటీ అధ్యక్షులు కే.కేశవరెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ కృష్ణ యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీలకు సమూచితస్థానం ఇవ్వడం జరిగిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎన్నడు లేని విధంగా అభివృద్ధి వైసిపి ప్రభుత్వం లో జరిగిందని పేర్కొన్నారు. వైసీపీ నాయకులు గోవిందరెడ్డి, గిరిజమ్మ,మోహనమ్మ, శివ ప్రకాష్,రత్నం రెడ్డి,దొరబాబు, గోపి,రవి రెడ్డి,దాము, వెంకటరత్నం, ఇవి చందు రాజు, తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ వ్యవస్థలో సమానత్వం తెచ్చిన ఘనత జగన్ దే

ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

విశాలాంధ్ర- చిత్తూరు: రాజకీయ వ్యవస్థలో సమానత్వం తీసుకొచ్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి కే దక్కిందని ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి తెలిపారు. గురువారం చిత్తూరు జిల్లా సచివాలయం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాజకీయంగా అన్ని వర్గాలకు సముచిత స్థానం కల్పించిన ఘనత వైసీపీ దే అన్నారు . ప్రస్తుతం జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా బీసీ అభ్యర్థులకు 11 స్థానాలు కేటాయించడం జరిగిందన్నారు. నవరత్నాల్లో భాగంగా పార్టీలకు అతీతంగా అన్ని వర్గాలకు లబ్ధి కల్పిస్తున్నామని చెప్పారు. చంద్రబాబు నాయుడు ఎన్నికల సమయంలో బీసీలను వాడుకొని తర్వాత వదిలేయడం పరిపాటేనని చెప్పారు. నేడు జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు అడిగే హక్కు వైసీపీకి ఉందన్నారు . ఎస్సీ ఎస్టీ మైనార్టీల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా వైసీపీ విజయం సాధించడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానానికి స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న ధనుంజయులు

ముగిసిన ఎమ్మెల్సీ నామినేషన్ల పర్వం

మూడు ఎమ్మెల్సీ స్థానాలకు 45 మంది నామినేషన్లు దాఖలు

విశాలాంధ్ర -చిత్తూరు: ప్రకాశం నెల్లూరు చిత్తూరు పట్టభద్రులు ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ నియోజకవర్గాలకు, ఉమ్మడి చిత్తూరు జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానానికి నామినేషన్ల స్వీకరణ పర్వం గురువారంతో ముగిసింది. శుక్రవారం దాఖలైన నామినేషన్లను ఎన్నికల రిటర్నింగ్ అధికారులు పరిశీలించనున్నారు. సోమవారం సాయంత్రం మూడు గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంది. అదే రోజు సాయంత్రం మూడు గంటల తర్వాత ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల జాబితాను అధికారుల ప్రకటించనున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానానికి వైకాపా అభ్యర్థిగా సిపాయి సుబ్రహ్మణ్యం, స్వతంత్ర అభ్యర్థిగా ధనుంజయులు నామినేషన్ దాఖలు చేశారు. ప్రకాశం నెల్లూరు చిత్తూరు ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ స్థానానికి ఏడు మంది నామినేషన్ దాఖలు చేశారు ఇందులో శ్రీరామ్ మూర్తి, చంద్రశేఖర్ రెడ్డి ప్రవీణ రెడ్డి బ్రహ్మానందం బాబు రెడ్డి ధనుంజయ శివయోగి చిన్న రమారెడ్డి లో నామినేషన్ దాఖలు చేశారు. ప్రకాశం నెల్లూరు చిత్తూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గానికి 36 మంది తమ నామినేషన్లను దాఖలు చేయడం జరిగింది కంచర్ల శ్రీకాంత్, నీలం శామ్యూల్ మెసేస్, కిరణ్ దాసరన్న, మాదాసి జులారావు భాస్కరరావు, చంద్రశేఖర్ ,సన్నారెడ్డి దయాకర్ రెడ్డి, శ్యాం ప్రసాద్ రెడ్డి, హేమ సుస్మిత , కంచర్ల సరిత, రాయపాటి జగదీష్, అభినవ్ విష్ణు, శ్రీనివాసరావు, వెంకటేశ్వర్ రెడ్డి, పలకమ్ రెడ్డి, వీరభద్రా చారి, శ్రీహరి , పూసల రవి, అంకయ్య చౌదరి, శివ ప్రసాద్ రెడ్డి, నక్క దినేష్ రాజేంద్ర హేమాద్రి రెడ్డి శ్రీకాంత్ మోహన్ రేఖ కరుణానిధి ర రమణారెడ్డి అనసూయమ్మ దయాకర్ రెడ్డి జయపాల్ ధనుంజయ సుధాకరయ్య రవి శ్రీరాములు సరిత లు నామినేషన్ దాఖలు చేశారు,

దేశం అన్ని రంగాల అభివృద్ధికి చదువే కీలకం

బాబు జూనియర్ కళాశాల వార్షికోత్సవంలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం.

విశాలాంధ్ర- సత్యవేడు: భారతదేశం అన్ని రంగాల్లోనూ అభివృద్ధి సాధించాలంటే చదువే కీలకమని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం స్పష్టం చేశారు.గురువారం స్థానిక బాబు జూనియర్ కళాశాల కరస్పాండెంట్ పరంధాం ఆధ్వర్యంలో 14వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగింది.ముఖ్య అతిథులుగా సురుటపల్లి ఆలయ చైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి, వైఎస్ఆర్సిపి మండల కన్వీనర్ సుశీల్ కుమార్ రెడ్డి, సీనియర్ నాయకుడు మాస్టర్ స్కూల్ అధినేత చంద్రశేఖర్ రెడ్డి తదితరులు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలు అధిరోహించడానికి విద్య అత్యంత ప్రాధాన్యమన్నారు.దీన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం విద్య రంగాన్ని బలోపేతం చేయడానికి అనేక చర్యలు చేపట్టిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు.ఇందులో భాగంగానే 8వ తరగతుల నుంచి ఈ ఏడాది నుంచి ట్యాబులు పంపిణీ చేస్తున్న విషయాన్ని ప్రస్తావించారు. అయితే విద్యార్థులు కూడా విద్య పట్ల శ్రద్ధ ఉంచి చదువుకోవాల్సిన అవసరం ఉందన్నారు.అప్పుడే పిల్లలపై తల్లిదండ్రులు పెట్టుకున్న ఆశయాలు నెరవేరుతుందన్నారు.ముఖ్యంగా క్రమశిక్షణతో అంకుటిత దీక్షతో విద్యార్థులు చదువులో రాణించాలని ఆయన కోరారు.విద్యార్థుల్లో కూడా చదువుల్లో పోటీ తత్వం ఉంటేనే ఉత్తీర్ణత శాతం పెరుగుతుందన్నారు.ప్రాథమిక విద్యా స్థాయిని పరిపుష్టి చేయడానికి ప్రభుత్వం నాడు నేడు పథకంలో బడులను ప్రైవేటుకు దీటుగా తీర్చిదిద్దిన విషయాన్ని గుర్తు చేశారు.ప్రైవేటు విద్యాలయాల్లో లేని సౌకర్యాలు కూడా ప్రభుత్వ బడులలో కల్పించడం జరిగిందన్నారు. తదనంతరం ఎమ్మెల్యే ఆదిమూలం వార్షికోత్సవం పురస్కరించుకొని వివిధ పోటీల్లో గెలుపొందిన దాదాపు 20 మంది విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు.అనంతరం సాంస్కృతిక కార్యక్రమాల భాగంగా విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో సురుటపల్లి ఆలయ సభ్యులు మునివేలు,ఉమాపతి, సచివాలయ మండల కన్వీనర్ సోమశేఖర్, వైఎస్ఆర్సిపి నాయకులు రాబర్ట్, అధ్యాపకులు ాలసుబ్రమణ్యం,సూర్య,ప్రియా,సుకన్య,భానుప్రియ, పుష్ప పలువురు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యానగర్ లోని శ్రీ వరసిద్ది వినాయక స్వామి దేవాలయ

మహా కుంభాభిషేకం మహోత్సవంలో మంత్రి రోజా

విశాలాంధ్ర - పుత్తూరు టౌన్ : పుత్తూరు పట్టణ ప్రాంతంలోని గురువారం ఉదయం రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక వ్యవహారాల, యువజన సర్వీసుల మరియు క్రీడా శాఖ మంత్రి ఆర్.కె.రోజా పుత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని విద్యానగర్ నందు నూతనంగా నిర్మించిన శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవాలయం మహా కుంభాభిషేక మహోత్సవం కార్యక్రమంలో గురువారం పాల్గొన్నారు ఆలయ నిర్వహకులు మంత్రి ఘన స్వాగతం పలికారు. పురోహితులు వేద మంత్రాలతో మంత్రి ఆశీర్వదించారు ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆలయ నిర్వహణ దూప దీప నైవేద్యాలు సక్రమంగా జరగాలని, స్వామి వారి చల్లని ఆశీస్సులతో ప్రజలందరికీ మంచి జరగాలని కోరుకొన్నారు ఈ కార్యక్రమంలో మంత్రి ఆర్కే రోజా అన్న కుమార్ స్వామి రెడ్డి ప్రత్యేకంగా పాల్గొని వినాయకుని స్వామిని దర్శించుకున్నారు పుత్తూరు మున్సిపాలిటీ చైర్మన్, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు ఆలయ బోర్డు చైర్మన్లు, గజేంద్ర నాయుడు ఆనంద నాయుడు గంగయ్య నాయుడు గ్రామ సర్పంచులు మెంబర్లు ప్రజాప్రతినిధులు వైఎస్ఆర్సిపి పార్టీ నాయకులు పోలీస్ శాఖ బృందం కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఈనాడు విషప్రచారాన్ని తిప్పికొట్టాలి

విశాలాంధ్ర-పుత్తూరు: నారాయణవనం మండల కేంద్రంలోని గురువారం సాయంత్రం 5 గంటల సమయంలో వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం మీద, రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మీద ఈనాడు పత్రిక, రామోజీరావు లు విష ప్రచారం చేయడం తగదని, ఎమ్మెల్యే ఆదిమూలం పార్టీ నాయకులు శ్రేణులు ఆ ప్రచారాన్ని గట్టిగా త్రిప్పి కొట్టాలని సత్యవేడు నియోజకవర్గ ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం వై.ఎస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పిలుపునిచ్చారు ఎమ్మెల్యే కొనేటి ఆదిమూలం నారాయణవనం బైపాస్ వైయస్సార్ కాంగ్రెస్ సర్కిల్ వద్ద వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టి ఈనాడు పత్రికలు తగలబెట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజలకు వాస్తవాలను అందించే బాధ్యతాయుతమైన రంగం పత్రిక రంగం అని, అలాంటింది బాధ్యత మరచి ఒక పార్టీకి కొమ్ముకాసేలా ఈనాడు విషపు రాతలు రాయడం సిగ్గుచేటు అని విమర్శించారు. పట్టాభి విషయంలో గతంలో జరిగిన సంఘటన తాలుకా ఫోటోలు వేసి ప్రభుత్వ ప్రతిష్ట దెబ్బతీయలని చూశారని పార్టీ సోషల్ మీడియా శ్రేణులు వాస్తవాలు ప్రచారం చేసేసరికి తప్పు ఒప్పుకొని క్షమాపణ చెప్పారని గుర్తుచేశారు. మరలా ఇలాంటి అసత్యాలు ప్రచారం చేస్తూ ప్రభుత్వ ప్రతిష్ఠ దెబ్బతీయలని చూస్తే తగిన బుద్ధి చెబుతామని సత్యవేడు ఎమ్మెల్యే కొనేటి ఆదిమూలం హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఫైనాన్స్ కమిటీ నెంబర్ సభ్యుడు కోనేటి సుమన్ కుమార్ సత్యవేడు నియోజకవర్గ ఎమ్మెల్సీ అబ్జర్వర్ ఇన్చార్జి రెడ్డి ఎంపీపీ దివాకర్ రెడ్డి మండల వైయస్సార్ కాంగ్రె స్ పార్టీ ఎంపీటీసీలు గ్రామ సర్పంచులు నాయకులు పాల్గొన్నారు.

గౌనీతిమ్మేపల్లి లో పొంచి ఉన్న ప్రమాదం

కొబ్బరి చెట్లు ను తొలగించాలని బాధితులు ఆవేదన

విశాలాంధ్ర -చిత్తూరు మండలంలోని గౌనీతిమ్మేపల్లి ఎస్ సి కాలనీలో నివాసం ఉంటున్న టి.కదిరెప్ప,టి.చంగప్ప ఇంటి ముందు 10 కొబ్బరి చెట్లున్నాయి. చెట్లు నుండి పట్టలు, టెంకాయిలు ఇంటి మీద పడటం,పెంకులు పగిలిపోవడం, నివాసమున్న వ్యక్తులకు దెబ్బలు తగలడం కొన్ని సంవత్సరాలుగా అప్పుడప్పుడు సంఘటన జరుగుతున్నది.పొంచి ఉన్న సమస్యపై బాధిత కుటుంబాలు స్థానిక యజమాని హిమామ్ షాబ్ కు చెప్పడం జరిగింది.కానీ అతను మాటలు లెక్కచేయకుండా కాలయపనం చేస్తు, విడ్డురంగా ప్రవర్తిస్తున్నారని.గడప గడపకు మన ప్రభుత్వం అనే కార్యక్రమం బాట పట్టిన ఎమ్మెల్ వెంకటేగౌడు, మండల రెవెన్యూ బృందం,సర్పంచ్ ,గ్రామ పెద్దలకు సమస్య వివరించడంతో రెండు రోజుల్లో మీకు ఇబ్బంది తలపించే చెట్లను తొలిగిస్తామని అధికార బృందం భరోసా ఇవ్వడం జరిగింది. సమస్య సర్దుమనుగుతుందని బాధిత కుటుంబాలు కొన్ని నెలలుగా ఎదురు చూశారు.కానీ ఫలితం లేకపోవడం జరిగింది.మంగళవారం మధ్యాహ్నం ఇంటి బయట కదిరెప్ప భార్య పనుల్లో నిమగ్న%శీ% కాగా చెట్టు నుండి టెంకాయి పట్ట విరిగి పెంకుటిల్లు పై పడి ఆమె పై పడటంతో స్వల్ప గాయలతో భయపడటం జరిగింది. పెంకులు ముక్కలుగా విరిగి పడ్డాయి.రోజు ఇంటి ముందు తిరగాలంటే అరచేతిలో ప్రాణాలు పెట్టుకొని బ్రతుకు తెరువు సాగించాల్సిన దుస్థితన్నారు. జరగరానిది జరిగితే ఎలాని యజమాన్ని ప్రశ్నించగా జరిగితే అప్పుడు చూద్దామని తల తిక్క సమాధానాలు చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంటి ముందు తీతగాలంటే భయంగా ఉన్నది, కొబ్బరి చెట్లు ఇంటి పై వాలు క్రమంలో ఊగుతున్నాయి.గాలి ఎక్కువ గా సంభవిస్తే ఇంటిపై చెట్టు కూలీ పడే అవకాశాలున్నాయి.వీటిని వెంటనే తొలగించి,మా ప్రాణాలను కాపాడాలని కోరారు.

హస్తకళల కళాకారులకు సబ్సిడీపై రుణ సౌకర్యం

డాక్టర్ గుమ్మిడిపూడి దశరథాచారి

కొయ్యబొమ్మల కళాకరులకు రెండోరోజు అవగాహన

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి : హస్తకళల అభివృధి కోసం ఖాది, గ్రామీణ పరిశ్రమల వారు హస్తకళల కళాకారులకు సబ్సిడీ రుణ సౌకర్యం కలిపిస్తుందని చిత్తూరు హ్యాండీక్రాఫ్ట్ ప్రొడ్యూసర్స్ కంపెనీ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గుమ్మిడిపూడి దశరథాచారి తెలిపారు. చిత్తూరు హ్యాండీక్రాఫ్ట్ ప్రొడ్యూసర్స్ కంపెనీ లిమిటెడ్, శ్రీకాళహస్తి వారి ఆధ్వర్యములో కొత్తపేటలోని కళా సృష్టి కామన్ ఫెసిలిటీ సర్వీస్ సెంటర్, శ్రీకాళహస్తి నందు చిత్తూరు హ్యాండీక్రాఫ్ట్ ప్రొడ్యూసర్స్ కంపెనీ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గుమ్మిడిపూడి దశరథాచారి అధ్యక్షతన రెండొవ రోజుల అంబేద్కర్ హస్తశిల్ప వికాస్ యోజన వర్క్ షాప్ గురువారం హస్తకళాకారుల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ గుమ్మిడిపూడి దశరాథాచారి మాట్లాడుతూ హస్తకళల అభివృధి కోసం ఖాది, గ్రామీణ పరిశ్రమల వారు హస్తకళల కళాకారులకు సబ్సిడీ రుణ సౌకర్యం కలిపిస్తుందని, ఇందులో పిఎంఇజిపి, ముద్ర యోజన వంటి రుణాల ద్వారా కళాకారుల ఆర్థిక అభివృద్ధి మెరుగు పరుచుకునే విధముగా ఉపయోగ పడుతుందని తెలియజేశారు. అదే విధముగా కళాకారులు తయారు చేసిన వస్తువులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పించే ఎక్సిబిషన్స్ ద్వారా విక్రయించే విధముగా, ఆన్లైన్ ద్వారా విక్రయించే పద్ధతులను గూర్చి తెలియజేశారు. పలువురు వక్తలు పాల్గొని వారి యొక్క సూచనలను సలహాలను కొయ్య బొమ్మల, కాలంకారి ఇతర హస్త కళాకరుల అభివృద్ధి కొరకై, శిక్షణ, డిజైన్, మార్కెటింగ్, ముద్రా, పిఎంఇజిపి రుణాల కొరకై తగిన సూచనలను అందించారు. ఈ కర్యక్రమంలో కరుణాకర్ (రిటైర్డ్ ఎంఎల్ఓ తొట్టంబేడు, శ్రీకాళహస్తి), సి.ఎ.యస్.యం ధనశేఖర్(ఆడిటర్, శ్రీకాళహస్తి), పి.రాధ కృష్ణ (దక్షిణ భారత దేవాంగ సంఘం, రిటైర్డ్ టీచర్), బి.వెంకయ్య (పెన్షనీర్స్ అసోసియేషన్ జెనరల్ సెక్రటరీ), డాక్టర్ జి.గీత దేవి (ప్రిన్సిపాల్, స్కిమ్స్ కళాశాల), సి.చెంచు రత్నం (ప్రెసిడెంట్, ఎపి ఎన్జిఓ శ్రీకాళహస్తి), ఆర్.కృష్ణ మూర్తి (సెక్రటరీ, రీచ్ ఎన్జిఓ, తిరుపతి), ఆర్.రవి నాయక్ (రీసెర్చ్ స్కాలర్, ఎస్వీ యూనివర్సిటీ), డాక్టర్ గంగారాం (లెక్చరర్, ఎస్వీఏ డిగ్రీ కళాశాల), యం. తులసి (లెక్చరర్, ఎస్వీఏ డిగ్రీ కళాశాల), జి.మునిలక్ష్మి (శుభోదయం కాలంకరి యం.ఏ.సీ సొసైటీ), హస్తకాళాకారులు. యస్.వి.ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద టెన్షన్ టెన్షన్

విశాలాంధ్ర- చిత్తూరు: జిల్లా సచివాలయం వద్ద గురువారం ఎమ్మెల్సీ నామినేషన్ల స్వీకరణ చివర సమయంలో టెన్షన్ వాతావరణం నెలకొంది. ఉమ్మడి చిత్తూరు జిల్లస్థానిక సంస్థల ఎమ్మెల్సీ , చిత్తూరు ప్రకాశం నెల్లూరు పట్టభద్రులు ఉపాధ్యాయుల నియోజవర్గాల నామినేషన్ స్వీకరణ గురువారంతో ముగిసింది. దీంతో ముందుగా వైకాపా అభ్యర్థి సిపాయి సుబ్రహ్మణ్యం తన నామినేషన్ దాఖలు చేశారు. ఈ క్రమంలో నామినేషన్ల చివరి సమయంలో తెలుగుదేశం అభ్యర్థిగా జిల్లా పంచాయతీ ఛాంబర్ అధ్యక్షులు విజయపురానికి చెందిన ధనుంజయ యాదవ్ ఎమ్మెల్సీ దొరబాబు తో కలిసి నామినేషన్ వేయడానికి కలెక్టర్ ఛాంబర్ లోకి వెళ్లారు. అయితే ఉమ్మడి చిత్తూరు జిల్లా స్థానిక సంస్థల ఎన్నికలు ఏకగ్రీవం అవుతాయి అని భావించిన వైసీపీ నేతలు దీంతో విస్తు పోయారు. అయితే నామినేషన్ దాఖలు చేయడానికి లోనికి వెళ్లిన టిడిపి నేతలు వెలుపలికి వచ్చేంతవరకు వైసీపీ అభ్యర్థి సిపాయి సుబ్రహ్మణ్యం తో పాటు తిరుపతి ఎంపీ గురుమూర్తి శ్రీకాళహస్తి ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి ఎమ్మెల్సీ భరత్ తదితరులు కలెక్టర్ కార్యాలయం వద్దనే వేచి ఉండడంతో ఎప్పుడు ఇలాంటి పరిస్థితి నెలకొంటుందో దన్న టెన్షన్ వాతావరణం నెలకొంది. అయితే బయట భారీ స్థాయిలో వైసీపీ కార్యకర్తలు వేచి ఉన్నారన్న సమాచారం తెలుసుకున్న టిడిపి శ్రేణులు. ఈ విషయాన్ని పోలీసుల దృష్టి తీసుకెళ్లారు. సమాచారం అందుకున్న చిత్తూర్ డి.ఎస్.పి శ్రీనివాస్ మూర్తి అదనపు బలగాలతో కలెక్టర్ కార్యాలయానికి వచ్చి టిడిపి తరఫున నామినేషన్ దాఖలు చేసిన ధనుంజయ యాదవ్ తో పాటు టిడిపి కార్యకర్తలను ఎస్కార్ట్ వాహనాల ద్వారా తరలించారు . దీంతో పరిస్థితి సద్దుమణిగింది.

నేడు వికే పల్లెలో టిడిపి సమావేశం

విశాలాంధ్ర- పులిచెర్ల-కల్లూరు :-పులిచెర్ల మండలం వికెపల్లెలో శుక్రవారం ఉదయం మార్చి 3, 4 తేదీలలో మండలంలో జరుగు టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువ గళం పాదయాత్ర ఏర్పాట్లపై మండల తెలుగు దేశం పార్టీ సమావేశం నిర్వహించనున్నారని మండల టీడిపి అధ్యక్షుడు కృష్ణమూర్తి నాయుడు తెలిపారు. ఈ సమావేశానికి పుంగనూరు నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్ చల్లా రామచంద్రా రెడ్డి విచ్చేసి పాదయాత్ర ఏర్పాట్లపై తగిన సూచనలు సలహాలు అందిస్తారని అన్నారు. మండలంలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు అందరూ పాల్గొనాలని ఆయన కోరారు.

సంక్షేమం అభివృద్ధి బీజేపీ అజెండా

బిజెపి రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు

విశాలాంధ్ర -చిత్తూరు: అభివృద్ధి సంక్షేమ మే భారతీయ జనతా పార్టీ ఎన్నికల ఆజెండాని రాష్ట్ర బిజెపి అధ్యక్షులు సోము వీర్రాజు తెలిపారు. గురువారం చిత్తూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో మూడు పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గాల్లో బిజెపి అభ్యర్థులు పోటీ చేస్తున్నట్లు చెప్పారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పల్లె నుంచి నగరం వరకు అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయి అన్నారు. రాష్ట్రంలో 8.65 లక్షల కోట్లతో జాతీయ రహదారులతోపాటు రైల్వే స్టేషన్ల అభివృద్ధి కారిడార్ నిర్మాణాలు చేపట్టామని చెప్పారు. జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా 80 లక్షల కుటుంబాలకు ఉపాధి ఇస్తున్నామని, 50 లక్షల మంది రైతులకు 6000 రూపాయలు చొప్పున చెల్లిస్తున్నామన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించే దిశగా బిజెపి వ్యూహ రచనలు చేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులు ఇచ్చిన హామీలను తుంగలో దక్కిందని, అలాగే ఉద్యోగస్తులకు సక్రమంగా జీతాలు చెల్లించలేని పరిస్థితి నెలకొన్న దన్నారు. రాష్ట్రంలో ఉద్యోగస్తులకు భద్రత కరువైందన్నారు. సంక్షేమ పరంగ కేంద్ర ప్రభుత్వం ద్వారా ఉచిత బియ్యం పంపిణీ కొనసాగుతున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభివృద్ధి సంక్షేమమే బిజెపి ప్రధాన అజెండా అని తెలిపారు.

తల్లిదండ్రులు, బి.ఆర్ అంబేద్కర్ ప్రత్యక్ష దైవాలు

విశాలాంధ్ర - ఐరాల : చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం కానిపాకం సమీపంలో ఉన్నటువంటి చిగరపల్లి గ్రామంలో గురువారం డాక్టర్ మాసిలామని,రిటైర్డ్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో వారి తల్లిదండ్రుల పదవ వర్ధంతి సంస్మరణ సభ జరిగింది. ఈ సందర్భంగా వారు వారి తల్లిదండ్రుల జీవితాన్ని స్మరించుకుంటూ,తమ జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవడానికి వారి తల్లిదండ్రులే కారణమని అలాగే ఉన్నత చదువులు చదువుకొని డాక్టర్ గా,మా తమ్ముడు బ్యాంక్ మేనేజర్ గా,చెల్లెలు గా స్థిరపడడానికి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కారణమని తెలిపారు. అలాగే గత పదేళ్లుగా చిగరపల్లి గ్రామంలో ఈ సంస్మరణ సభ జరుపుతూ దాదాపు 100 మంది గ్రామస్తులకు చీరలు,దుస్తులు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా కొందరు నాయకులను,గ్రామ పెద్దలను, సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనేవారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మహేష్ స్వేరో మాట్లాడుతూ తల్లిదండ్రుల గురించి ఇలాంటి కార్యక్రమం జరపడం చాలా గొప్పదని, డా మాసిలా మని,ఆయన కుటుంబ సభ్యుల ప్రయాణం యువత అందరికీ స్ఫూర్తిదాయకం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు,చిగరపల్లి యూత్,మహిళలు,స్థానిక నాయకులు రాజేంద్ర, నటరాజ,గుణ,అవార్డ్ రవి,రాజ,రజినీ,విజయ్,విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గణనాధుని హుండీ లెక్కింపు

విశాలాంధ్ర - ఐరాల : స్వయంభు వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం నందు హుండీ లెక్కింపు ద్వారా 20 రోజులుగాను 1,36,52,181 రూపాయలు, బంగారం 45 గ్రాములు, వెండి ఒక కేజీ 700 గ్రాములు, యూఎస్ఏ డాలర్స్ 4037, ఆస్ట్రేలియా డాలర్స్ 235, కెనడా డాలర్స్ 35, ఇంగ్లాండ్ పౌండ్స్ 15, సింగపూర్ డాలర్స్ 12, మలేషియా రింగ్ ఇట్స్ 1, ఆదాయం వచ్చినట్లు దేవస్థానం చైర్మన్ మోహన్ రెడ్డి, కార్యనిర్వహణాధికారి వెంకటేశు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ లు ఎస్ .వి. కృష్ణారెడ్డి, రవీంద్రబాబు, విద్యాసాగర్ రెడ్డి, హరి మాధవరెడ్డి, హేమమాలిని, పర్యవేక్షకులు శ్రీధర్ బాబు, కోదండపాణి, శ్రీనివాస్, రవి, అర్థగిరి ఆలయ ఈవో సుబ్బారెడ్డి, యూనియన్ బ్యాంక్ కాణిపాకం శాఖ, దేవస్థానం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రెండు దుకాణాల్లో చోరీ

విశాలాంధ్ర - రామకుప్పం : మండల కేంద్రమైన రామకుప్పం లో ని ఆటో సర్కిల్ నుండి ఎంపీడీవో కార్యాలయానికి వెళ్ళే దారిలో గుర్తు తెలియని వ్యక్తులు రెండు దుకాణాల లో తాళంచెవి పగులగొట్టి బుధవారం రాత్రి చోరీకి పాల్పడ్డారని బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు పోలీసులు మరియు బాధ్యతుల కథనం మేరకు వివరాలు ఎలా ఉన్నాయి రామకుప్పం ఇందిరానగర్ కాలనీకి చెందిన ఇసాక్ బాషా టీ దుకాణం నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు ఈ తరుణంలో బుధవారం రాత్రి వ్యాపారం ముగించుకుని ఇంటికి వెళ్లానని గురువారం తెల్లవారుజామున యధావిధిగా దుకాణం తెరవడానికి వచ్చి చూడగా గుర్తు తెలియని వ్యక్తులు తాళం పగలగొట్టి ఉందని పరిశీలించగా రెండు వేల రూపాయల నగదు, మరియు టీ తయారు చేయు సామాగ్రి తదితరులు వస్తువులు దోచుకెళ్లారని ఆవేదన వ్యక్తం చేశారు అదేవిధంగా రాజగోపాలచారికి చెందిన దుకాణంలో వెండి నగలు, 2వేల రూపాయలు నగదు చోరీకి గురైందన్నారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి సంఘటనకు పాల్పడిన వ్యక్తులకు పట్టుకుంటామని ఎస్ఐ కృష్ణయ్య తెలిపారు .

అంకాల పరమేశ్వరి ఆలయంలో విశేష పూజలు

విశాలాంధ్ర -చిత్తూరు: బైరెడ్డివల్లి మండలంలోని దేవదొడ్డి గ్రామంలో శ్రీ శ్రీ శ్రీ మెల్ మలయనూర్ అంకాల పరమేశ్వరి ఆలయంలో మహా కొల్లు పూజలు అంగరంగ వైభవంగా గురు వారం నిర్వహించారు. ఆలయ ప్రాగణంలో అమ్మవారు వాక్ చెప్పడం జరిగింది. దీని కొరకు పెద్ద ఎత్తున భక్తులు ఎగబడటం జరిగింది. అమ్మవారి ఆలయం పక్కన ఉన్నటువంటి కాలికమాత ప్రాగణం వద్ద విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని గ్రామ పురవీధుల్లో ఊరేగించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. విచ్చేసిన భక్తులకు రోజంతా అన్నదానం ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో బైరెడ్డిపల్లి వి హెచ్ సి అధికారి విజయచంద్రన్ కుటుంభ సమేతంగా పాల్గొని అమ్మవారి ఆశీసులు పొందారు. ఆలయ ధర్మ కర్త కోటయ్య, ఎస్.వి సుబ్రమణ్యం, రాజ్ కుమార్,బాలాజీ అమ్మవారు భక్తులు పాల్గొన్నారు.

కలశాలకు అభిషేకం

ఆలయమంతా పచ్చని తోరణాలు... పూజల్లో వేమిరెడ్డి దంపతులు

విశాలాంధ్ర - సూళ్లూరుపేట : శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయం లో జరుగుతున్న రెండవ రోజు కుంబాభిషేక వేడుకల్లో భాగంగా అమ్మణ్ణికి ప్రత్యేక అభిషేకాలు అనంతరం యాగ శాలలో పూజలు నిర్వహించారు, ఆలయమంతా అరటి మానులు,మామిడాకులు తో పచ్చని తోరణాలు కట్టి పండుగ వాతావరణాన్ని తెచ్చారు ,ఈ పూజల్లో ఉభయదాతలు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి దంపతులు, కిలివేటి సంజీవయ్య, ఆలయ చైర్మన్ దువ్వూరు బాలచంద్ర రెడ్డి దంపతులు, ఆళ్ళ శ్రీనివాసులు రెడ్డి దంపతులు పాల్గొన్నారు, ముందుగా యాగశాలలో పూజలు చేసిన అనంతరం లక్షకుంకుమార్చన పూజల్లో పాల్గొన్నారు,అనంతరం 16 శిఖర కలిశాలకు సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు ఈ వేడుకల్లో ఆలయ ట్రస్ట్ సభ్యులు ముప్పాళ్ల చంద్రశేఖర్ రెడ్డి,వంకా దినేష్,కర్లపూడి సురేష్,బండి సునీత,ఓలేటి బాలసత్యనారాయణ,మన్నెముద్దు పద్మజ, నాయుడు కుప్పం నాగమణి,తదితరులు పాల్గొన్నారు.

పది పదవులతో 3 కోట్ల మందికి సాధికారత

సజ్జలను చూస్తే జాలేస్తోంది

- బిసి వెల్ఫేర్ జెఏసి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ యం.ఉమేష్ రావు

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి రావడానికి విశేషంగా కృషి చేసిన బిసి లకు పది పదవులు ఇచ్చి మూడు కోట్ల మంది బిసిల సాధికారత సాధించినట్లు గొప్పలు చెప్పుకుంటున్న సజ్జల రామకృష్ణా రెడ్డిని చూస్తే జాలేస్తోందని తెలుగు నాడు విద్యార్థి సమాఖ్య మాజీ రాష్ట్ర కార్యదర్శి, బిసి వెల్ఫేర్ జెఏసి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ యం.ఉమేష్ రావు ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన విజయం కోసం శక్తి వంచన లేకుండా శ్రమించిన కార్యకర్తలను, నాయకులను బలి చేసి, తనను ఓడించాలని ఎవరైతే కష్టపడ్డారో అటువంటి వారికి ఎమ్మెల్సీ, ఇతర నామినేటెడ్ పదవులు ఇచ్చిన గొప్ప నాయకత్వం వైకాపా సొంతమని ఎద్దేవా చేశారు. వెనుకబడిన కులాలను ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేయించిన ఏకైక రాజకీయ పార్టీ తెలుగుదేశం పార్టీ అని ఉమేష్ గుర్తు చేశారు. వైకాపా పది మందికి పదవులు ఇచ్చేసి, మూడు కోట్ల మంది బిసి లకు న్యాయం చేసేసినట్లు ఊకదంపుడు ఉపన్యాసాలు ఇవ్వడం చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని పేర్కొన్నారు. కర్ర పెత్తనం చెలాయించే కీలక పదవులు జగన్మోహన్ రెడ్డి సామాజిక వర్గానికి సొంతం చేసి, బంట్రోతు పదవులు బడుగు బలహీన వర్గాలకు అప్పగించిన గొప్ప రాజకీయ చతురుడు జగన్మోహన్ రెడ్డి అని ఉమేష్ ఎద్దేవా చేశారు. సజ్జల రామకృష్ణా రెడ్డి మరియు వైవి సుబ్బారెడ్డి ల స్థానంలో బడుగులకు అవకాశం ఇవ్వడానికి జగన్మోహన్ రెడ్డి సిద్ధమా అని ప్రశ్నించారు. తిరుగులేని అత్యధిక మెజారిటీతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి విజయానికి ఎనభై శాతం కారణమైన బిసిలకు కీలక స్థానాలలో పదవులు ఇస్తావా అని జగన్మోహన్ రెడ్డిని ఉమేష్ ప్రశ్నించారు.

ఆకట్టుకున్న కృష్ణవేణి బృందం నృత్య ప్రదర్శన

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి : మహాశివరాత్రి ఉత్సవాలలో భాగంగా శ్రీకాళహస్తి పట్టణం స్వర్ణముఖినదీతీరాన ఏర్పాటుచేసిన ధూర్జటి కళాప్రాంగణంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో ఆకట్టుకున్నాయి. ఈనేపథ్యంలో పట్టణానికి చెందిన కృష్ణవేణి బృందం హేమలత రెడ్డి, వెన్నెల, చోటు, తేజ ,దేవాన్షితల, నృత్యప్రదర్శన భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. మహంకాళి అన్న పాటకు చక్కగా నృత్యప్రదర్శన చేయడం గమనించదగ్గ విషయం. అనంతరం కృష్ణవేణి బృందాన్ని ఆలయ సిబ్బంది ముక్కంటి తీర్థప్రసాదాలు అందజేసి ఘనంగా సత్కరించి జ్ఞాపికను మెమెంటోను అందజేశారు. ప్రతి ఏటా నిర్వహించే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో సాంస్కృతి కి కార్యక్రమాల్లో కృష్ణవేణి బృందం పాల్గొని భక్తులను ఎంతగానో ఆ కొట్టుకునే విధంగా నృత్య ప్రదర్శన చేయడం విశేషమని పట్టణంలోని పలువురు కొనియాడారు.

క్రీడాకారులను ప్రోత్సహించేందుకే బహుమతులు ప్రదానం

విశాలాంధ్ర - గూడూరు : క్రీడాకారులను ప్రోత్సహిం చేందుకే ప్రోత్సాహక బహుమతులుఅందిస్తున్నామని ప్రముఖ ఛార్టెడ్ అకౌంటెంట్, ఎస్ వీ. రత్నం ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ శ్రీకంటి రామమోహన్ రావు అన్నారు. గురువారం జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో రాష్ట్ర స్థాయి క్రీడలలో రాణించిన విద్యార్థినులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు విద్యలో కూడా రాణించి ఉన్నత స్థాయికి ఎదిగి పాఠశాలకు తల్లిదండ్రులకు గుర్తింపు తీసుకురావాలని కోరారు. ప్రోత్సాహక బహుమతులు అందించడంతో ఇతర విద్యార్థుల్లో కూడా క్రీడల్లో రాణించాలని ఉత్సాహం కలుగుతుందన్నారు. కేవలం క్రిడల్లోనే కాకుండా విద్యలో కూడా ఉన్నత స్థాయికి ఎదిగి తల్లిదండ్రులకు పాఠశాలకు గుర్తింపు తీసుకురావాలని సూచించారు. అనంతరం వైసీపీ సీఈసీ సభ్యులు ఎల్లసిరి గోపాల్ రెడ్డి, శ్రీకంటి రామమోహన్ రావులు క్రీడాకారులకు శాలువాలు కప్పి సన్మానించారు. బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉమాశంకర్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాధవి లత, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

డయల్ యువర్ లోకేష్ గోడపత్రికల ఆవిష్కరణ

విశాలాంధ్ర - గూడూరు : జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ బాబు యువగళం పాదయాత్ర తిరుపతి పార్లమెంట్ పర్యటనలో భాగంగా గురువారం గోడపత్రికల ఆవిష్కరణలో గూడూరు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్ కుమార్ హాజరయ్యారు. ఈ కార్యక్రమం మాజీ మంత్రి ఎన్. అమర్నాద్ రెడ్డి ఆధ్వర్యంలో రేణిగుంట వై. కన్వెన్షన్ హాల్ సెంటర్ లో నిర్వహించారు. యువగళం పాదయాత్ర గోడపత్రికల ఆవిష్కరణలో టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ మంత్రులు పాల్గొన్నారు.

గర్భవతులకు సరైన పౌష్టికాహారం అందించి రక్తహీనత తగ్గించాలి : కలెక్టర్

విశాలాంధ్ర - తిరుపతి : వైద్య అధికారులు సూచించిన మేరకు రక్తహీనత గల గర్భవతులకు సరైన పోషికాహారం అందించి , వాడే విధంగా అవగాహన కల్పించి ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ కె.వెంకటరమణా రెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం అన్ని జిల్లాల కలెక్టర్లతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి వర్చువల్ విధానంలో అమరావతి నుండి వైద్య ఆరోగ్య , మహిళా శిశు సంక్షేమ శాఖల కార్యక్రమాల అంశాలపై సమీక్ష నిర్వహించగా కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ , జిల్లా అధికారులు పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో సమీక్షిస్తూ ఆయుష్ మాన్ భారత్ నమోదు పై దృష్టి పెట్టాలి, 100 శాతం పూర్తి చేయాలని అన్నారు. జిల్లాలో హైరిస్క్ గర్భవతులు మాడరెట్ 335 మంది, ముగ్గురు సివియర్ నమోదు వుందని, సరైన పౌష్టకాహారం అందించి , ఆ పౌష్టకాహారాన్ని వాడేవిధంగా అవగాహన కల్పించాలని సూచించారు. ప్రసవ సమయానికి 7 రోజుల ముందే ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి తీసుకెళ్లి, అడ్మిట్ చేయాలని అన్నారు. ప్రభుత్వ , నెట్ వర్క్ ఆసుపత్రుల్లో చికత్స పొందిన వారి వద్ద అందిన వైద్య సేవలపై అభిప్రాయం సేకరించి ప్రభుత్వానికి నివేదించాలని అన్నారు. ఫ్యామిలీ డాక్టర్ అమలవుతున్న విధానంపై అందిస్తున్న మందులు సమీక్ష నిర్వహించారు. ఆరు సంవత్సరాల వయస్సు ఎత్తు, బరువు తక్కువ పిల్లలు 10 వేలు వున్నారని వైద్య ఆరోగ్య శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖలు సంయుక్తంగా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని బాలామృతం సక్రమంగా అందాలని అన్నారు. హాస్టల్స్ , పాఠశాలలో వున్న విద్యార్థుల కు రక్తహీనత లేకుండా పరీక్షలు, పోషకాహార అందించాల న్నారు. మైనర్ వయస్సు గల గర్భవతులు నమోదు అవుతున్నారని, అవగాహన కల్పించి బాల్యవివాహాల వల్ల కలిగే నష్టాలను , వారికి కలిగే అనారోగ్య సమస్యలు తెలియజేయాలని అన్నారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సాధనపై దృష్టి పెట్టాలని అన్నారు. 6 సంవత్సరాల లోపు పిల్లల ఆధార్ నమోదు శాతం పెరగాలని , ఆధార్ పొంది 10 సంవత్సరాలు అయిన వారు అప్ డేట్ కోసం ఈ నెల 27, 28 ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు కావాలని అన్నారు. సచివాలయంలో పౌర సేవలు ఆలస్యం లేకుండా అందించాలని , ప్రతి అర్జి నిర్ణీత సమయం లోపు పరిష్కరించాలని అన్నారు. బడి బయటి పిల్లల ను గుర్తించి పాఠశాలలో చేరేవిధంగా చూడాలని అన్నారు. ఈ సమావేశంలో డి ఎం హెచ్ ఓ శ్రీహరి, డి సి హెచ్ ఎస్ ప్రభావతి, డి ఎల్ డి ఓ సుశీల దేవి, ఐసి డి ఎస్ పిడి జయలక్ష్మి , డి ఐ ఓ శాంత కుమారి, ఎస్ సి వెల్ఫేర్ ఆఫీసర్ చెన్నయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

శ్రీసిటీని సందర్శించిన ఎస్టోనియన్ వ్యాపార ప్రతినిధుల బృందం

-భారత్ లో మొబైల్ హెల్త్‌కేర్ యూనిట్ల తయారీ పరిశ్రమపై అధ్యయనం

విశాలాంధ్ర- సత్యవేడు: సెమెట్రాన్ ఎంఎంహెచ్ గ్రూప్ ఎక్స్‌పోర్ట్స్ విభాగాధిపతి, ఎస్టోనియా మాజీ రక్షణ మంత్రి మార్గస్ త్సాక్నానేతృత్వంలోని ఎస్టోనియన్ వ్యాపార ప్రతినిధుల బృందం, భారతీయ జాయింట్ వెంచర్ పార్ట్‌నర్స్ 'ఏవిరాన్ హెల్త్' సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లతో కలిసి గురువారం శ్రీసిటీని సందర్శించింది. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి వారికి సాదర స్వాగతం పలికి,శ్రీసిటీ భారీ పారిశ్రామిక నగరం మౌలిక సదుపాయాలు, ప్రత్యేకతలు, పరిశ్రమల ఏర్పాటు ప్రయోజనాలను వివరించారు. ఎస్టోనియాకు చెందిన సెమెట్రాన్ లిమిటెడ్ ఉన్నతాధికారులు మరియుఏవిరాన్‌హెల్త్‌కేర్ ప్రతినిధుల శ్రీసిటీ సందర్శన పట్ల రవీంద్ర సన్నారెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ, ఇక్కడ వ్యాపార అనుకూల వాతావరణం, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, ప్రతిభ కలిగిన మానవ వనరులు, ప్రభుత్వ సహకారం ఖచ్చితంగా వారిని ఆకట్టుకుంటుందన్నారు. అలాగే ఎస్టోనియా మరియు ఉత్తర ఐరోపాలోని ఇతర దేశాల నుండి పెట్టుబడులకు మార్గం సుగమం చేస్తుందనిపేర్కొన్నారు. దేశీయ మరియు ఎగుమతి ప్రయోజనాల కోసం, ముఖ్యంగా ఆసియా, యూరోపియన్ యూనియన్ మరియు ఆఫ్రికా కోసం 'మేక్ ఇన్ ఇండియా' కింద మొబైల్ హెల్త్‌కేర్ యూనిట్లను భారతదేశంలో తయారు చేయాలని కంపెనీ ప్రతిపాదిస్తోంది. తదనుగుణంగా అనువైన పారిశ్రామిక ప్రదేశం కొరకు అన్వేషిస్తున్నది.వ్యాపార ప్రతినిధులు శ్రీసిటీ ఎండీతో చర్చల సందర్భంగా ఎంతో ఆసక్తిని కనబరిచి, శ్రీసిటీలోనివివిధ అంశాలపై ప్రశ్నలడిగి తమ సందేహాలు నివృత్తి చేసుకున్నారు.అనంతరం వీరుపారిశ్రామికవాడను సందర్శించారు. కాగా, సెమెట్రాన్ ఎంఎంహెచ్ సంస్థ ఎస్టోనియాలోని ప్రముఖ ఇన్వెస్టర్ గ్రూప్. ఆ దేశం యొక్క డిఫెన్స్ అండ్ సెక్యూరిటీ ఇండస్ట్రీ ఇన్నోవేషన్ క్లస్టర్‌లో సభ్యులు. ఎంటర్‌ప్రైజ్ ఎస్టోనియా ద్వారా యూరోపియన్ రీజినల్ డెవలప్‌మెంట్ ఫండ్ ద్వారా ఈ క్లస్టర్ కు నిధులు అందుతోంది. ఇది నాటోలోని సభ్య దేశాలకు వేగవంతమైన విస్తరణ మొబైల్ మాడ్యులర్ ఫీల్డ్ హాస్పిటల్ యూనిట్లు, ఇతర అనుబంధ ఉత్పత్తులను తయారీసరఫరా చేస్తుంది. ఏవిరాన్‌హెల్త్‌కేర్ అనేది హెల్త్-టెక్ విభాగంలో ప్రారంభించబడ్డ ఒక అంకుర సంస్థ. జనాభాలోని అన్ని వర్గాలకు సరసమైన, అందు బాటులో ఉండే మొబైల్ మెడికేర్ మరియు టెలిమెడిసిన్ పరిష్కారాలను అందిస్తుంది. ఇది భారతీయ, గ్లోబల్ మార్కెట్లకు అనుగుణంగా కొత్త-యుగం వైద్య వినూత్న సాంకేతికతలను అందించాలని పనిచేస్తోంది.

అభిమానమే అండగా..

నారా లోకేష్ కు అడుగడుగునా పూల వర్షం

విశాలాంధ్ర-రేణిగుంట: అభిమానమే అండగా... అడుగడుగునా పూల వర్షం కురిపిస్తూ... మండుటెండను లెక్కచేయకుండా... నారా లోకేష్ అడుగులో అడుగు వేస్తూ... వందలాది జనం కదలి రాగా రేణిగుంట మండలంలో యువగళం పాదయాత్ర విజయవంతమైంది. తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర 25వ రోజైన గురువారం రేణిగుంట మండలంలో సాగింది. జీ పాళెంలో ప్రారంభమైన ఈ యాత్ర నల్లపాళెం గ్రామం చేరింది. ఇక్కడ ప్రజలు హారతులతో నారా లోకేష్ కు ఘన స్వాగతం పలికారు. గ్రామ సమస్యలను లోకేష్ కు వివరించారు. నీలసానిపేట వద్ద గ్రామ ప్రజలు భారీగా పాల్గొని నారా లోకేష్ అనుకూలంగా నినాదాలు చేస్తూ హారతులు పట్టారు. గ్రామంలోని సమస్యలను లోకేష్ దృష్టికి తీసుకెళ్లారు. గాజులమండ్యం గ్రామంలోకి చేరుకోగానే బాణసంచాలు పేలుస్తూ మంగళహారతులతో గ్రామస్తులు, తెలుగుదేశం పార్టీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. క్రేన్ సాయంతో భారీ గజమాలతో లోకేష్ కు సత్కరించారు. గాజులమండ్యం గ్రామంలో నారా లోకేష్ మాట్లాడుతూ ప్రజా సమస్యలు తెలుసుకోవడానికి యువగళం పాదయాత్ర చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం పోలీస్ వ్యవస్థను అడ్డుపెట్టుకొని అడుగడుగున సమస్యలు సృష్టిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ఆశీస్సులతో యువగళం పాదయాత్ర దిగ్విజయంగా ముందుకు సాగుతోందన్నారు. పోలీసులు అడ్డుపెట్టుకొని యువగళం పాదయాత్రను ఆపలేరన్నారు. ఎవరైనా ఆపడానికి ప్రయత్నిస్తే పాదయాత్ర దండయాత్రగా సాగుతుందన్నారు.

నారా లోకేష్... సీఐ ఆరోహణ రావు మధ్య వాగ్వాదం

గాజులమండ్యంలో నారా లోకేష్, సీఐ ఆరోహణరావు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. పాదయాత్రలో స్టూలుపై నిలబడి మాట్లాడవద్దని ఆరోహణరావు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నారా లోకేష్ స్పందిస్తూ మైకులతో మాట్లాడటం లేదని తమపై ఉద్దేశపూర్వకంగానే పోలీసుల గొడవలు పెట్టుకుంటున్నారని మండిపడ్డారు. నారా లోకేష్ ప్రసంగాన్ని సీఐ అడ్డుకోవడంతో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు ఒక్కసారిగా తిరుగుబాటు చేశారు. డీయస్పీ రామచంద్ర, గాజులమద్యం ఎస్ఐ ధర్మారెడ్డి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. పాదయాత్ర గాజులమండ్యం హరిజనవాడ వద్దకు చేరుకోగానే గ్రామస్తులు నారా లోకేష్ కు హారతులతో స్వాగతం పలికారు. సూర్యనారాయణ పురం వద్ద గ్రామస్తులు పసుపువచ్చ తోరణాలు మంగళహారతులతో స్వాగతం పలికారు. సీబీఐడీ కాలనీ వద్ద నారా లోకేష్ ప్రజలకు అభివాదం చేస్తూ పసిబిడ్డను ఎత్తుకొని ముద్దులాడారు. ప్రజలతో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు అమరనాథరెడ్డి, పరసారత్నం, మాజీ ఎమ్మెల్యేలు సునీల్ కుమార్, సుగుణమ్మ, శ్రీకాళహస్తి నియోజకవర్గం టీడీపీ ఇన్ ఛార్జి బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి, అనంతపురం జిల్లా సింగనమల టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ బండారు శ్రావణి, ఎమ్మెల్సీ దీపక్ రెడ్డి, టీడీపీ నాయకులు రావిళ్ళ మునిరాజానాయుడు, చెంచయ్య నాయుడు, రవీంద్రనాథరెడ్డి, చక్రాల ఉష, షాకీర్ అలీ, కాసారం రమేష్, వజ్రం కిషోర్, ఆర్ముగం, టీడీపీ మండల అధ్యక్షుడు చంద్రారెడ్డి, పట్టణ అధ్యక్షుడు మహబూబ్ బాషా, సీనియర్ నాయకులు చెర్లోపల్లి సుబ్రహ్మణ్యం రెడ్డి, చిన్నారెడ్డి, మునస్వామి నాయుడు, నెల్లూరు సుబ్రహ్మణ్యం, టిడిపి మాజీ పట్టణ అధ్యక్షుడు వెంకటేష్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజా అవరోహణం

విశాలాంధ్ర -శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో మహాశివ రాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా 11వ రోజైన గురువారం సాయంత్రం ధ్వజావరోహణ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా స్వామి వారి గర్భాలయానికి ఎదురుగా ఉన్న ధ్వజస్తంభంపై వృషభ సంకేత ధవళ పతాకాన్ని ఎగురవేసి ధ్వజావరోహణ చేశారు. అంతకు మునుపు ధ్వజస్తంభం వద్ద స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ఈ వేడుకలను తిలకించడానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. ధ్వజావరోహణంతో శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు దాదాపు ముగిసి పోయాయి.

సింహాసనం, కామధేనువుపై శివపార్వతుల పురవిహారం

శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా 11వ రోజైన గురువారం రాత్రి నూతన వధూవరులైన శివ పార్వతులు సింహాసనం, కామధేనువుపై పురవిహారం చేశారు. శ్రీకాళహస్తీశ్వరుడు సింహాసనం పైన జ్ఞాన ప్రసూనాంబ అమ్మవారు కామధేనువు పైనా ఊరేగుతూ భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. పురవీదుల్లో ఊరేగుతున్న పార్వతీ పరమేశ్వరులకు భక్తులు కర్పూర హారతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

శాస్త్రోక్తంగా వసంతోత్సవం



విశాలాంధ్ర -శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా 11వ రోజైన గురువారం వసంతోత్సవ కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఇందులో భాగంగా నూతన వధూవరులైన గంగాభవానీ సమేత శ్రీకాళహస్తీశ్వరుడు. జ్ఞాన ప్రసూనాంబ అమ్మవార్ల ఉత్సవ మూర్తులను వసంతోత్సవ మండపంలో ఉంచారు. స్వామి, అమ్మవార్లకు క్షీర, నారికేళ, చందన, పంచామృత, నదీ పుణ్య జలాలతో అభిషేకాలు నిర్వహించారు. అభిషేకాల అనంతరం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు జరిపి కర్పూర హారతులు సమర్పించారు. అదేవిధంగా స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను పురవీధుల్లో ఊరేగించారు. ఇక మధ్యాహ్నం సూర్య పుష్కరణి వద్ద త్రిశూల స్నానం చేయించారు. త్రిశూలానానికి శాస్త్రోక్తంగా అభిషేకాలు నిర్వహించారు.

నేడు పల్లకీ సేవ

శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని 12వ రోజైన శుక్రవారం రాత్రి పల్లకీసేవ నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా శివ పార్వతులు పల్లకీల్లో పురవీధుల్లో ఊరేగనున్నారు.

విశాలాంధ్ర తిరుపతి జిల్లా

ప్రభుత్వ నిర్ణయం దళితులకు శ్మశానవాటిక ఏమైంది

- సిపిఐ జిల్లా కార్యదర్శి పి మురళి.

విశాలాంధ్ర-తిరుపతి : దళితుల జనాభాను బట్టి అర ఎకరం నుంచి ఎకరం స్థలంలో శ్మశానవాటిక ఏర్పాటు చేయాలన్న రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నిర్ణయం ఏమైందని ఒక ప్రకటనలో సిపిఐ జిల్లా కార్యదర్శి పి. మురళి ప్రశ్నించారు. తిరుపతి పట్టణంలో గత 30 సంవత్సరాలుగా జీవనం సాగిస్తున్నటువంటి ఎస్సీ కులానికి చెందిన బట్టి మంగమ్మ భర్త బట్టి పెంచలయ్య (లేట్) చనిపోతే దేవేంద్ర థియేటర్ పక్కన ఉన్నటువంటి స్మశానవాటికలు పుడ్చడానికి వీలు లేదన్నారు. అదేవిధంగా స్థానిక అధికారులు తెలియపరచినప్పటికీ ఏమాత్రం స్పందన కూడా లేదు. దళితుల పట్ల ప్రేమానురాగాలు ఉన్నట్టు రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దళితుల జనాభాను బట్టి అర ఎకరం నుంచి ఎకరం స్థలంలో శ్మశానవాటిక ఏర్పాటు చేయాలని 45 రోజులు సంబంధిత అధికారులకు తెలియజేసినప్పటికీ ఇంతవరక ఆ ప్రక్రియ ఎక్కడ కూడా పూర్తిగా లేదు. దళితుల జనాభాను బట్టి అర ఎకరం నుంచి ఎకరం స్థలంలో శ్మశానవాటిక ప్రభుత్వ భూమి లేకపోతే రైతుల నుంచి భూసేకరణ 45 రోజుల్లో ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశం ఏమైందని ప్రశ్నించారు. దళితులకు ప్రతి గ్రామంలో శ్మశానవాటిక ఉండాలని ముఖ్యమంత్రి జగన్ నిర్ణయించారన్న అన్నమాట అబద్ధమేనా? దళితులు ఉన్న ప్రతి గ్రామంలో, పట్టణంలో తగిన భూమిని గుర్తించాలని భూ పరిపాలన ప్రధాన కమిషనర్, రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు ఏమయ్యాయి. పట్టణంలో,గ్రామంలోని దళితుల జనాభాను బట్టి అర ఎకరం నుంచి, ఎకరం స్థలాన్ని గుర్తించాలని చెప్పారు. ఎక్కడైనా ప్రభుత్వ భూములు లేకపోతే గ్రామంలోని రైతుల నుంచి భూమిని సేకరించి, వారికి వేరే చోట భూమిని ఇవ్వడం వంటి అంశాలపై దృష్టి పెట్టాలని చెప్పారు. 45 రోజుల్లో ఈ ప్రక్రియను పూర్తి చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం ఏమైందనీ సిపిఐ జిల్లా కార్యదర్శి మురళి ప్రశ్నించారు.

66వ రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ స్కేటింగ్ పోటీలో

విశ్వం విద్యార్థి యశ్వంత్ కి బంగారు పథకాలు

విశాలాంధ్ర - తిరుపతి : స్థానిక తిరుపతిలోని విశ్వం టాలెంట్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న యం. యశ్వంత్ విశాఖపట్నం లో 20వ తేదీ నుంచి 22వ తేదీ ఫిబ్రవరి 2023 వరకు జరిగిన 66వ రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్, ఆంధ్ర ప్రదేశ్ వారు నిర్వహించిన అంతర జిల్లాల స్కేటింగ్ ఛాంపియన్షిప్ పోటీలో పాల్గొని వివిధ విభగాలో 3 బంగారు పతకాలను సాధించి జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీలకు ఎంపిక అయాడు.ఈ సందర్భంగా యస్వంత్ ను విశ్వం విద్యా సంస్థల అధినేత డా.ఎయన్. విశ్వ నాథ్ రెడ్డి మరియు అకాడమిక్ డైరెక్టర్ యన్. విశ్వ చందన్ రెడ్డి, ఉపాధ్యాయులు అభినందించి జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీలోను సత్తా చాటి రాష్ట్రానికి పేరు తేవాలని ఆకాంక్షించారు.

వైయస్సార్ సీపీ విద్యార్థి విభాగం తిరుపతి జిల్లా అధ్యక్షుడిగా ఓబుళరెడ్డి

విశాలాంధ్ర -తిరుపతి రూరల్ : వైయస్సార్ సీపీ విద్యార్థి విభాగం తిరుపతి జిల్లా అధ్యక్షుడిగా చంద్రగిరి నియోజకవర్గం రామచంద్రపురం మండలం రామాపురం కు చెందిన ఓబుళరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు వైసిపి అధినాయకత్వం నియామక ఉత్తర్వులను జారీ చేసింది. ఎస్వీ యూనివర్సిటీలో పీజీ, పీహెచ్.డీ పూర్తి చేసిన ఓబులరెడ్డి, సుదీర్ఘకాలం విద్యార్థి రాజకీయాల్లో కొనసాగుతున్నారు. గతంలో ఎన్ఎస్ యూఐ రాష్ట్ర కార్యదర్శిగా వ్యవహరించారు. వైయస్ జగన్మోహన్ రెడ్డి కాంగ్రెస్ ను వీడిన తర్వాత, వైయస్సార్ విద్యార్థి సంఘం లో ఓబుళ రెడ్డి చురుకుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఓబుళ రెడ్డి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ప్రజలకు, విద్యార్థులకు, యువతకు, మహిళలకు అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను అన్ని వర్గాల ప్రజలకు తెలియజేస్తామని అన్నారు. రాబోయే ఎన్నికల్లో వైయస్ జగన్మోహన్ రెడ్డిని మళ్ళీ సీఎం గా గెలిపించేందుకు విద్యార్థులు, యువతను ఏకతాటిపైకి తీసుకొచ్చి కృషి చేస్తామని తెలిపారు. తన నియామకానికి తోడ్పడిన ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, వైసిపి తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీ చెంగాలమ్మ పరమేశ్వరి అమ్మవారిని దర్శించుకున్న సినీ సంగీత దర్శకులు

విశాలాంధ్ర - సూళ్లూరుపేట : ఆంధ్ర తమిళుల ఆరాధ్య దైవమైన శ్రీ చెంగాలమ పరమేశ్వరి అమ్మ వారిని బుధవారం ప్రముఖ సినీ సంగీత దర్శకులు సాలూరి వాసు రావు అమ్మవారిని దర్శించుకున్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారిపై ప్రత్యేక పాటలసిడిని తయారు చేశామని అది త్వరలో శ్రీ చెంగాలమ్మ పరమేశ్వరి దేవి బ్రహ్మోత్సవాలలో రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి వారి ధర్మపత్ని ప్రశాంత్ రెడ్డి సూళ్లూరుపేట శాసనసభ్యులు కిలివేటి సంజీవయ్య ఆధ్వర్యంలో రిలీజ్ చేస్తామని ఆయన తెలిపారు.

ఇన్ ప్రిన్సిపల్ లేఓట్ ప్యాట్రన్ పై అభ్యంతరాలు తెలపండి

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి : తుడా వారిచే ఇన్ ప్రిన్సిపల్ లేఓట్ ప్యాట్రన్ అప్రూవల్‌పై ఏవైనా అభ్యంతరాలుంటే తెలుపాలని శ్రీకాళహస్తి పురపాలక సంఘ కమిషనర్. బాలాజీ నాయక్ కోరారు. ఈ మేరకు అప్రూవల్ కాపీలను పురపాలక సంఘ సిబ్బంది గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ శ్రీకాళహస్తి పురపాలక సంఘము పరిధిలో గల శ్రీకాళహస్తి రెవెన్యూ నెం: 290/2ఎ, 290/2బి లలో భూమికి లేఓట్ రెగ్యులరేజషన్ స్కీం క్రింద ప్రభుత్వ జీ.వొ.నెం: 10, తేది: 10-01-2020 మేరకు తిరుపతి అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ (తుడ) వారిచే ఇన్ ప్రిన్సివల్ లేఓట్ ప్యాట్రన్ నెం: ఐపిఎల్‌పి2020/టియుడిఎ/ఎస్‌కెఎల్‌టి/000966, అప్ర్యూవల్ చేసియున్నారన్నారు. కావున పట్టణ ప్రజలకు తెలియజేయడమేమనగా పై తెలిపిన ఇన్ ప్రిన్సిపల్ లేఓట్ ప్యాట్రన్ పై ఏమైన అభ్యంతరములు ఉన్నచో ఈ దినము నుండి 15రోజులలోగా పురపాలక సంఘ కార్యాలయము నందు వ్రాతపూర్వకముగా తెలియజేయవలసినదిగా కోరారు.

వైభవం... కేడిగవాహన సేవ

విశాలాంధ్ర -శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని 11వ రోజైన గురువారం ఉదయం శివ పార్వతులకు కేడిగ వాహన సేవ వైభవంగా నిర్వహించారు. మొదట అలంకార మండపంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం కేడిగ వాహనంపై స్వామి, అమ్మవార్లను అధిష్టించి పురవీధుల్లో ఊరేగించారు. కేడిగ వాహనంపై పురవీధుల్లో ఊరేగుతున్న జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని దర్శించుకోవడానికి భక్తులు బారులు తీరారు. కర్పూర హారతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

రోటరీ సేవలు అభినందనీయం

విశాలాంధ్ర-గూడూరు: రోటరీ క్లబ్ 118వ వార్షికోత్సవం సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని గూడూరు పురపాలక సంఘ కమిషనర్ సాయినాథ్ అన్నారు. గూడూరు పట్టణంలోని హిందూ స్మశాన వాటికలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన నీటి కొళాయిని కమీషనర్ ప్రారంభించారు. గురువారం రోటరీ క్లబ్ 118వ వార్షికోత్సవ సందర్భంగా గూడూరు పట్టణంలోని హిందూ స్మశాన వాటికలో నీటి కొళాయిని ఏర్పాటు చేశారు. కుళాయిని కమిషనర్ సాయినాథ్ ప్రారంభించారు. అలాగే రెండో పట్టణ పరిధిలోని మినీ బైపాస్ వద్ద రాజమాత రోటరీ క్లబ్ బస్సు షెల్టర్ ను రాజమాత దేవి శిష్యులు వైసిపి నాయకులు గోపాల్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ సాయినాథ్ మాట్లాడుతూ 118వ వార్షికోత్సవం జరుపుకుంటున్న రోటరీ క్లబ్ కు శుభాకాంక్షలు తెలిపారు. రోటరీ క్లబ్ చేస్తున్న సేవా కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో రోటరీ క్లబ్ గూడూరు శాఖ అధ్యక్షులు కిరణ్ చక్రవర్తి, రవికుమార్, వీవీ కృష్ణయ్య, మునిగిరిష్, నంది మండలం బాలకృష్ణం రాజు, జనార్ధన్ రెడ్డి, చేవూరు విజయ మోహన్ రెడ్డి, దశరథ రామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.